

# విభారె
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY







PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర్ రెడ్డి మంగళవారం 19-07-2022 సంపుటి: 03 సంచిక: 292 పేజీలు: 4 వెల: రూ 3-00


## తెలుగు రాష్ట్రాల్లో రాష్ట్రపతి ఎన్నిక పోలింగ్..

### ఓటు వేసిన జగన్, కేటీఆర్







తెలుగు రాష్ట్రాల్లో రాష్ట్రపతి ఎన్నిక పోలింగ్ కొనసాగుతోంది. హైదరాబాద్, అమరావతిలోని అసెంబ్లీల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు ఓటుహక్కు వినియోగించుకుంటు న్నారు.ఏపీలో సీఎం జగన్, తెలంగా ణలో మంత్రి కేటీఆర్ తొలి ఓటు వేశారు. మధ్యాహ్నం తర్వాత సీఎం కేసీఆర్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. మొత్తం పోలింగ్ ప్రక్రియను వీడియో తీస్తున్నారు .ఏపీ అసెంబ్లీ ప్రాంగణంలోని పోలింగ్ కేంద్రంలో సీఎం జగన్ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్యేలు, మంత్రులు ఓటు వేసేందుకు క్యూలైన్లలో నిలబడ్డారు. వైకాపా తరఫున మంత్రి బుగ్గన, శాసనసభా వ్యవహారాల సమన్వయకర్త, ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారు. మొత్తం 175మంది ఎమ్మెల్యేలు పోలింగ్‌లో పాల్గొనేలా ఏర్పాట్లు చేశారు. తెదేపా అధినేత చంద్రబాబు.. తమ ఎమ్మెల్యేలతో కలిసి పార్టీ కార్యాలయం నుంచి అసెంబ్లీకి చేరుకుని ఓటుహక్కు వినియోగించుకున్నారు. వైకాపా, తెదేపాలకు చెందిన ఎంపీలు పార్లమెంట్‌లో ఓటు వేయనున్నారు. తెలంగాణ రాష్ట్ర శాసనసభలోనూ రాష్ట్రపతి ఎన్నిక పోలింగ్ కొనసాగుతోంది. మంత్రి కేటీఆర్ సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు అసెంబ్లీకి తరలి వచ్చారు. తొలి ఓటు హక్కును మంత్రి కేటీఆర్ వినియోగించుకోగా.. ఆ తర్వాత పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఓటు వేశారు. ఎన్నికల సంఘం ప్రత్యేక అనుమతితో ఆంధ్రప్రదేశ్‌లోని కందుకూరు ఎమ్మెల్యే మహీధర్ రెడ్డి తెలంగాణ శాసనసభలో ఓటు వేశారు.

## గడప గడపకు మన ప్రభుత్వం..



అమరావతి: 'గడప గడపకు మన ప్రభుత్వం'పై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి రిజనల్ కోఆర్డినేటర్లు, జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలు హాజరయ్యారు. ఇప్పటికే గడప గడపకు వెళ్తున్న ఎమ్మెల్యేలు.. మూడేళ్లలో ప్రజలకు ప్రభుత్వం ఏం చేసిందో వివరిస్తున్నారు. అత్యంత ప్రాధాన్య కార్యక్రమంగా గడప గడపకు మన ప్రభుత్వం చేపట్టారు. ప్రతినెలా ఎమ్మెల్యేలు, సమన్వయకర్తలతో సీఎం జగన్ సమీక్షిస్తున్నారు. రెండో నెల కూడా సీఎం జగన్ సమీక్షను నిర్వహించారు.

కీలక ఆదేశాలు..

### సీఎం జగన్ కీలక ఆదేశాలు



గడప గడపకు మన ప్రభుత్వంపై సమీక్షలో సీఎం జగన్ కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రతి నియోజకర్గ అభివృద్ధికి రూ.2 కోట్లు చొప్పున నిధులు కేటాయించారు. ప్రతి నెల 6 లేదా 7 సచివాలయాలు సందర్శించాలని సీఎం ఆదేశించారు. ప్రతి సచివాలయంలో సమస్యల పరిష్కారానికి రూ.20 లక్షల నిధులు ఇస్తామని సీఎం తెలిపారు. సచివాలయం విజిట్ పూర్తయిన వెంటనే కలెక్టర్లు నిధులిస్తారని సీఎం ప్రకటించారు.

## వరద సహాయక చర్యలను ముమ్మరం చేయాలి : ఏపీ సీఎం



అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో గోదావరి వరదముంపు ప్రాంతాల్లో వరద సహాయక చర్యలను ముమ్మరం చేయాలని ఏపీ సీఎం జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు జారీ చేశారు. ఇవాళ వరద ముంపు ప్రాంతాల అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. పంట నష్టం, వరద ముంపు నష్టంపై అధికారులకు సూచనలు చేశారు. వరద నీరు క్రమంగా తగ్గుముఖం పడుతోందని వెల్లడించారు.మరో 48 గంటల్లోగా ప్రతి ఇంటికీ రూ. 2వేలు ఇవ్వాలని , ప్రతి ఇంటికీ 25 కిలోల బియ్యం, నిత్యావసరాలు అందించాలని , సచివాలయం, వాలంటీర్ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు. ప్రభుత్వం వద్ద నిధుల సమస్య లేదని స్పష్టం చేశారు. ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. వరద తగ్గగానే నష్టంపై అంచనా వేయాలని సూచించారు.10 రోజుల్లోగా పంట, ఆస్తినష్టంపై అంచనా పూర్తి చేయాలన్నారు. గర్భిణుల పట్ల శ్రద్ధ వహించాలని, వారిని ఆస్పత్రులకు తరలించాలని పేర్కొన్నారు. కల్వర్టులు, వంతెనలకు త్వరగా మరమ్మతులు పూర్తి చేయాలని తెలిపారు. గోదావరి కట్టలు బలహీనంగా ఉన్న చోట్ల ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. విద్యుత్ పునరుద్ధరణ, మరమ్మతు పనులకు ప్రాధాన్యత ఇవ్వాలని వివరించారు. కలెక్టర్లు, సీనియర్ అధి కారులు బాధ్యత తీసుకోవాలని సూచించారు.

## మరో రెండు రోజులపాటు వర్షాలు: అమరావతి వాతావరణ కేంద్రం

అమరావతి: రాష్ట్రంలో మరో రెండు రోజులపాటు వర్షాలు పడే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఇవాళ తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడతాయని..చాలా చోట్ల ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. రేపు, ఎల్లుండి తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు పడతాయని వెల్లడించింది. మంగళవారం రాష్ట్రంలోని పలు చోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపింది. రుతుపవన ద్రోణి ప్రస్తుతం జైసల్మేర్, కోట, గుణ, ఈశాన్య విదర్భ, పరిసర ప్రాంతంలో ఉన్న అల్పపీడనం రాయ్‌పూర్, పరదీప్ గుండా ప్రయాణిస్తూ ఆగ్నేయ దిశగా, తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు సగటు సముద్ర మట్టానికి 1.5 కి.మీ ఎత్తు వరకు విస్తరించి ఉందని వివరించింది. ఆంధ్రప్రదేశ్, యానాంలో దిగువ ట్రోపో ఆవరణంలో నైరుతి, పడమర గాలులు వీస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం వెల్లడించింది.



## రాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ ప్రారంభం

### ఓటు వేసిన ప్రధాని మోడీ

ఢిల్లీ: సోమవారం ఉదయం 10 గంటలకు రాష్ట్రపతి ఎన్నికల పోలింగ్ ప్రారంభమైంది. ప్రధాని నరేంద్ర మోడీ, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్, యుపి సిఎం యోగి, తమిళనాడు సిఎం స్టాలిన్, పలువురు మంత్రులు, ఎంఎల్ఎలు ఓటు హక్కును వినియోగించుకున్నారు.



పార్లమెంటు భవన్ లోని పోలింగ్ కేంద్రంలో ప్రధాని మోడీ ఓటు వేశారు. దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల అసెంబ్లీల్లో పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. సోమవారం సాయంత్రం సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగనుంది. 15వ భారత రాష్ట్రపతిని ఎన్నుకునేందుకు దాదాపు 4,800 మంది ఎంపిలు, ఎంఎల్ఎలు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. జులై 21న పార్లమెంటు భవనంలో ఓట్ల లెక్కింపు జరుగుతుంది. ఈ నెల 25న నూతన రాష్ట్రపతి ప్రమాణ స్వీకారం చేస్తారు. రాష్ట్రపతి ఎన్నికలలో ఎన్‌డిఎ అభ్యర్థిగా ద్రౌపది ముర్ము, విపక్షాల తరఫున యశ్వంత్ సిన్హా బరిలో ఉన్న విషయం తెలిసిందే.

## సుప్రీంకోర్టులో ఏపీ ప్రభుత్వానికి చుక్కెదురు

ఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. వ్యక్తిగత డిపాజిట్ (పీడీ) ఖాతాలకు మళ్లించిన స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ (ఎస్‌డీఆర్ఎఫ్) నిధులను వెనక్కి ఇవ్వాలని సుప్రీం ధర్మాసనం ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించింది.రెండు వారాల్లోగా ఆ



నిధులు తిరిగి ఇవ్వాలని స్పష్టం చేసింది. దీంతో నిధులు వెనక్కి ఇచ్చేందుకు సిద్ధమని ఏపీ ప్రభుత్వం తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కొన్ని కొవిడ్ బాధిత కుటుంబాలకు ఇంకా పరిహారం అందలేదని న్యాయవాది తెలపగా.. పరిష్కార కమిటీ దృష్టికి తీసుకువెళ్లాలని కోర్టు సూచించింది. వచ్చిన ఫిర్యాదులను నాలుగు వారాల్లో పరిష్కరించాలని కమిటీని ఆదేశించింది.కొవిడ్ నిధుల మళ్లింపుపై గతంలోనే ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. నిధులు వెనక్కి ఇవ్వడంపై ప్రభుత్వ అభిప్రాయం తీసుకుంటామని న్యాయవాది అనగా.. అవసరం లేదని ఇటీవల జరిగిన విచారణలో స్పష్టం చేసింది. దీనిపై తామే ఉత్తర్వులు ఇస్తామని ధర్మాసనం తెలిపింది.

## సుప్రీం తీర్పు ..జగన్‌కు చెంపపెట్టు : చంద్రబాబు



అమరావతి : సుప్రీంకోర్టు ఏపీ ప్రభుత్వాన్ని చివాట్లు పెట్టిందని, ఇది సీఎం జగన్‌కు చెంపపెట్టు లాంటిదని టీడీపీ అధినేత చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో కొవిడ్ బాధిత కుటుంబాలకు చేయూతను అందించేందుకు కేంద్రం , విపత్తు నిర్వహణ సంస్థలు రాష్ట్రానికి రూ. 1,100 కోట్ల నిధులను విడుదల చేసిందని తెలిపారు. ఈ నిధులను వైసీపీ ప్రభుత్వం పక్కదారి పట్టించిందని ఆరోపించారు.ఈ నిధుల మళ్లింపును సుప్రీం తీవ్రంగా తప్పు పట్టిందని విమర్శించారు. నిధులను ఎస్‌డీఆర్ఎఫ్ ఖాతాలో జమ చేయాలని ఆదేశించిందని వివరించారు. కొవిడ్‌తో ఛిన్నాభిన్నమైన కుటుంబాలను ఇప్పటికైనా ఆదుకోవాలని డిమాండ్ చేశారు.కొవిడ్ నిధులు పక్కదారి పట్టించిన వ్యవహారంపై ఇవాళ సుప్రీంకోర్టులో విచారణ కొనసాగింది. మళ్లించిన నిధులను తిరిగి రెండువారాల్లో ఎస్‌డీఆర్ఎఫ్ ఖాతాలో జమ చేయాలని జస్టిస్ ఎం.ఆర్‌షా ధర్మాసనం ప్రభుత్వాన్ని ఆదేశించింది . పీడీ ఖాతాల్లోకి మళ్లించిన సుమారు. రూ. 1,100 కోట్లను ఎస్‌డీఆర్ఎఫ్ ఖాతాలోకి జమ చేయాలని స్పష్టం చేసింది. కరోనా పరిహారం అందలేదని ఎవరైనా ఫిర్యాదు చేస్తే నాలుగు వారాల్లోగా సమస్యను పరిష్కరించాలని వెల్లడించింది.

## తెలుగు రాష్ట్రాల్లో వరద పరిస్థితిపై కేంద్రానికి వివరించిన1 కిషన్ రెడ్డి



హైదరాబాద్ : గోదావరి నదికి వచ్చిన వరదల వలన తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో ప్రజలకు, వారి జీవనోపాధికి జరిగిన నష్టం గురించి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ని కలిసి వివరించారు. దీనిపై స్పందించిన అమిత్ షా.. ఆయా ప్రాంతాలలో అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను వీలయినంత త్వరగా అందించమని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధికారులను ఆదేశించారు. తెలంగాణలో అవసరమైన రెస్క్యూ, రిలీఫ్ ఆపరేషన్లను నిర్వర్తించడానికి ఇప్పటికే 13 ఎన్డీఆర్ఎఫ్ (ఔఆఖీఈ) బృందాలను పంపించడం జరిగిందని అమిత్ షా స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి సంబంధించిన ఎస్డీఆర్ఎఫ్ (ూఆఖీఈ) నిధులను కేటాయించినప్పటికీ, మొదటి విడత నిధులను విడుదల చేయడానికి అవసరమైన విజ్ఞాపణ పత్రాలను తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకూ అందించలేదన్నారు. ఈ పత్రాలను పంపించిన వెంటనే అవసరమైన అన్ని రకాల సహకారాన్ని అందించటానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించిన మొదటి విడత నిధులను ఎన్డీఆర్ఎఫ్ (ఔఆఖీఈ) నుంచి ఇప్పటికే విడుదల చేయడం జరిగిందని కేంద్ర హోం మంత్రి త్వ శాఖ స్పష్టం చేసింది. ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసిన వెంటనే రెండో విడత నిధులకు సంబంధించిన కేటాయింపులు జరిపి, నిధులను విడుదల చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ప్రాథమిక నివేదిక అందిన వెంటనే కేంద్ర ప్రభుత్వ బృందాలను పంపి జరిగిన నష్టం అంచనా వేయడానికి సిద్ధంగా ఉన్నట్లు చెప్పింది.

# సంపాదకీయం

మంగళవారం 19-07-2022

## ఉచితాలపై అనుచితం...

ప్రధాని నరేంద్ర మోడీ ఎందుకు చేశారో, ఎవరిని టార్గెట్ చేసి పేల్చారో తెలియదు కానీ ఓట్ల కోసం ఉచిత పంపిణీల(పథకాలు) పై ఆయన చేసిన వ్యాఖ్యలు దేశ వ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. ఓటేయండి చాలు... ఇంక మీరేం చేయనవసరం లేదు. మీ అవసరాలన్నీ మేమే ఉచితంగా తీర్చేస్తాం. కాలు బయటపెట్టకుండా మీకు సకల సౌకర్యాలూ ఇంటి ముంగిటకు తీసుకువచ్చి అమరుస్తాం అన్న రీతిలో ఎన్నికలలో విజయమే లక్ష్యంగా పార్టీలు, ప్రభుత్వాలూ పోటీలు పడి మరీ హామీలు గుప్పించేస్తుండటం ఇటీవలి కాలంలో బాగా ఎక్కువ అయిపోయింది. అన్నీ ఉచితంగా ఇచ్చేస్తామంటూ హామీలు గుప్పించేసి, తీరా అధికారం చేపట్టిన తరువాత వాటి అమలుకు రాష్ట్ర ఖజానా ఖాళీ అవుతున్నా సరే అనివార్యంగా నిబంధనలన్నిటికీ తిలోదకాలిచ్చేసి మరీ అప్పులు చేస్తున్నాయి.ఇంత చేసినా ఇచ్చిన హామీల అమలుకు సరిపోక.. రాష్ట్రాలకు రాష్ట్రాలు దివాళా ముంగిట నిలబెడుతున్నాయి. అన్నీ ఉచితమంటూనే.. రోజు గడవడానికి ఆదాయం కోసం ప్రజలపైన పన్నులు విధించి ముక్కు పిండి వసూలు చేస్తూ వారి జీవితాలనూ కుదేలు చేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాల ప్రస్తుత స్థితి ఇందుకు ఉదాహరణగా చెప్ప వచ్చు. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ విషయాన్నే తీసుకుంటే.. అప్పులు కూడా చేసి మరీ ఉచితాలకు లక్షల కోట్లు ఖర్చు వ్యయం చేస్తోంది. అదే చేత్తో నిత్యావసర ధరలన్నీ విపరీతంగా పెంచేసి ఆ ప్రజల నెత్తినే బండ పడేస్తోంది. పాతికేళ్ల మద్యం ఆదాయాన్ని సైతం తాకట్టు పెట్టి అప్పు తెచ్చి రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్ చేయడానికి కూడా సిద్ధమైపోయింది ఏపీ సర్కార్. యూపీలో బుందేల్ ఖండ్ ఎక్స్ ప్రెస్ వే ప్రారంభోత్సవం సందర్భంగా మోడీ ఉచిత పథకాలపై రాష్ట్రాలకు సూచన లాంటి హెచ్చరిక చేశారు. ఇది దేశ అభివృద్ధికి విఘాతమని ఉద్ఘాటించేశారు. దేశ ప్రగతికి ఫ్రీ బీస్ గొడ్డలి పెట్టు వంటివన్నారు. ఉచితాలు అనర్ధదాయకమనీ, వీటిని నియంత్రించే విషయంలో రాష్ట్ర ప్రభుత్వాలు గట్టి నిర్ణయం తీసుకోవాలని, లేదా కేంద్రం ఈ దిశగా చట్టం చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. అమలు సాధ్యం కాని హామీలను ఇచ్చే పార్టీలను, ప్రభుత్వాలను నియంత్రించే దిశగా చట్టం రావలసిన అవసరం ఉందనడంలో సందేహం లేదు. కేబినెట్ పరిమాణాన్ని నియంత్రించేందుకు చట్టం తీసుకువచ్చిన విధంగానే ఈ ఫ్రీ బీస్ హామీలను నియంత్రించే దిశగా కూడా చట్టం తీసుకురావలసిన అవసరం ఎంతైనా ఉందని రాజ్యాంగ నిపుణులు గత కొంత కాలంగా నెత్తీ నోరూ బాదుకుంటున్నారు.అధికారమే పరమావధిగా భావిస్తున్న రాజకీయ పార్టీలు ఈ దిశగా పడే ప్రతి అడుగుకూ ప్రతిబంధకంగా మారుతున్నారు. రుణ మాఫీ హామీని విమర్శించిన నోటితోనే కేంద్రం కూడా రుణ మాఫీ హామీ ఇచ్చిన సంగతినీ ఈ సందర్భంగా గుర్తు చేసుకోవడం అసంబద్ధం కాదు. అయితే ఉచితాలు అనర్థం అంటూ మోడీ చేసిన వ్యాఖ్య ఏ విధంగా చూసినా హర్షించాల్సిందే. అయితే ఆయన ఈ వ్యాఖ్యలు ఏ ఉద్దేశంతో చేశారు. ఏ వ్యూహంతో ఈ హెచ్చరిక చేశారు అన్న దానిపై పలు సందేహాలు వ్యక్తమౌతున్నాయి. ప్రధానిగా మోడీ అధికారం చేపట్టినప్పటి నుంచీ ఆయన అనుసరిస్తున్న విధానాలన్నీ బీజేపీ పాలిత రాష్ట్రాలకు అనుకూలంగా, విపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలను ఇరుకున పెట్టేలా ఉన్నాయన్న విమర్శలు ఉన్నాయి. ముఖ్యంగా ఆయన కేటాయింపులు, నియామకాలు, ప్రధాన్యతల విషయంలో దేశానికి ప్రధానిగా కాకుండా గుజరాత్ ప్రధానా అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని పలు రాష్ట్రాలు నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయిఅయితే సందర్భం ఏదైనా, అవసరం ఎలాంటిదైనా ప్రధాని నోటి వెంట ఓట్ల కోసం ఉచిత పంపిణీలు దేశ భవితకు ప్రమాదకరమన్న మాటలు మాత్రం అక్షర సత్యమని పరిశీలకులు అంటున్నారు. మోడీ ఆశీస్సులు లేకుండానే కుప్ప తెప్పలుగా అప్పులు చేస్తూ రాష్ట్రంలో అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు తిలోదకాలిచ్చేసి మూడేళ్లలోనే రాష్ట్ర భవిష్యత్ ను అంధకార బంధురంగా మార్చేసిన ఏపీ గురించి ఆయన ఏం చెబుతారనీ ప్రశ్నిస్తున్నారు. ఏపీ ప్రభుత్వ తీరు దేశ భవిష్యత్ కు ప్రతిబంధకం కాదా అని ప్రశ్నిస్తున్నారు.ఏపీ అడగడమే ఆలస్యం అన్నట్లుగా అప్పులకు ఎందుకు గ్రీన్ సిగ్నల్ ఇస్తున్నారని నిలదీస్తున్నారు. ఇప్పటికైనా ఏపీలా అడ్డగోలుగా అప్పులు చేసి మరీ ఓట్ల కోసం పెట్టుబడిగా పెట్టిన రాష్ట్రాల నిగ్గు తేల్చి వాటిని నియంత్రించడమే కాకుండా నిబంధనల ఉల్లంఘనపై చర్యలు తీసుకోవడానికి ఉపక్రమిస్తేనే మోడీ మాటలకు విశ్వసనీయత ఉంటుందని పరిశీలకులు అంటున్నారు.మోడీ లక్ష్యం ఒకటి అయితే ఆయన విమర్శ బాణం మరొక చోట తగిలిందా అన్న అనుమానాన్ని పరిశీలకులు వ్యక్తం చేస్తున్నారు. మోడీ వ్యాఖ్యలపై ఏపీ సీఎం జగన్ మౌనంగా ఉంటే... ఢిల్లీ సీఎం కేజ్రీ వాల్ మాత్రం ఘాటుగా స్పందించారు. నేరుగా ప్రధాని పేరు ప్రస్తావించకుండానే.. ఉచిత విద్య, ఉచిత విద్యుత్ పథకాలు కేవలం ఉచిత పథకాలు కావని కేజ్రీవాల్ అన్నారు. అవి భవిష్యత్ తరాల బాగు కోసం ఇప్పుడు పెడుతున్న పెట్టుబడి లాంటివన్నారు. ఉచిత విద్య వల్ల పేదలు చదువుకుని దేశ ప్రగతిలో, ఉత్పాదకతలో భాగస్వాములౌతారని అన్నారు. అలాగే వ్యవసాయానికి ఉచిత విద్యుత్ వల్ల వ్యవసాయ ఉత్పత్తులు గణనీయంగా పెరుగుతాయనీ వివరించారు.నిజమైన ఉచితాలనేవేమైనా ఉంటి అవి బడా వ్యాపారులకు చేసే వేల కోట్ల రూపాయల మాఫీలేనని రిటార్డ్ ఇచ్చారు. అంతే కానీ ఢిల్లీ ప్రభుత్వం 18 లక్షల మందికి ఉచిత విద్య, రెండు కోట్ల మంది పేదలకు ఉచిత వైద్యం ఉచిత పథకాల కిందకు రావని అన్నారు. పేద విద్యార్థులకు ఉచిత విద్య ద్వారా దేశ ప్రగతిని మా వంతు సహకారం అందిస్తున్నట్లేఅన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో మొహల్లా క్లినిక్ లు అద్భుత పాత్ర వహిస్తున్నాయని చెప్పుకొచ్చారు. రాజకీయ పార్టీలకు విరాళాలిచ్చి, బ్యాంకుల నుంచి వేల కోట్ల రూపాయలు అప్పులు తీసుకున్న బడా వ్యాపార సంస్థలు, పారిశ్రామిక వేత్తలకు చేసే రుణ మాఫీ నిజమైన ఉచిత పథకమని కేజ్రీవాల్ అన్నారు.

## పాపం... సెల్ఫ్ డిఫెన్స్ లో జగ్గిరెడ్డి

కాకినాడ, జూలై 18, డిఫెన్స్ పడ్డ ఆ ఎమ్మెల్యే.. సెల్ఫ్‌గోల్ చేసుకున్నారా? ఘటన జరిగిన ఐదు రోజుల తర్వాత సీన్‌లోకి ఎందుకు ఎంట్రీ ఇచ్చారు? గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని పోలీసులు అప్రమత్తంగా వ్యహరించారా? రోజంతా హైడ్రామా నడిచిన వ్యవహారంలో కొండను తవ్వి ఎలుకను పట్టుకుంది ఎవరు?పోలీస్ స్టేషన్‌లో నేలపై పరుపు వేసుకుని నిద్ర పోతున్నది ఎవరో కాదు.. కోనసీమ జిల్లాలోని కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి. ఈ సీన్‌కు వేదిక రావులపాలెం పోలీస్ స్టేషన్. రెండు రోజులు ఇక్కడ నాటకీయ పరిణామాలు రాజకీయ చర్చకు దారితీశాయి. ఖాకీలపై ఖద్దరు పైచెయ్యి సాధిస్తుందా? లేక ఖద్దరుపై ఖాకీ మాటే నెగ్గుతుందా అనే అంతా ఆరా తీశారు.రావులపాలెం మండలం గోపాలపురంలో అంబేద్కర్ ఫొటోలతో టిఫిన్ ప్లేటుల్లో ఆహార పదార్థాలు ఇవ్వడంతో ఈ నెల 5న గొడవ జరిగింది. ఆ కేసులో 18 మందిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు పంపారు పోలీసులు. రెండు నెలల క్రితం అమలాపురంలో జరిగిన అల్లర్లను దృష్టిలో పెట్టుకుని.. గోపాలపురం ఘటనలో ఖాకీలు చాలా వేగంగా స్పందించారు. శాంతి భద్రతల సమస్య రాకుండా జాగ్రత్త పడ్డారు. ఈ ఘటనపై రాజకీయ పార్టీలు చేయాల్సిందంతా చేశాయి. రెండు వైపులా వ్యవహారాన్ని చక్కబెట్టినట్టు హల్‌చల్ చేశాయి. అయితే ఈ ఎపిసోడ్‌లో వైసీపీ వెనకపడిందని అనుకున్నారో ఏమో.. ఐదు రోజుల తర్వాత ఎంట్రీ ఇచ్చారు ఎమ్మెల్యే జగ్గిరెడ్డి .వైసీపీ ప్లీనరీలో బిజీగా ఉండటంతో నియోజకవర్గంలో ఏం జరుగుతుందో పట్టించుకోలేదని కేడర్ క్వశ్చన్ చేయకుండా.. జగ్గిరెడ్డే అడ్వాన్స్ అయిపోయారని టాక్. సమస్యను ప్రతిపక్షాలు బాగానే టేకాఫ్ చేశాయని.. ఆ సీన్‌లో మనం ఎక్కడా లేమని కొందరు చెప్పడంతో ఎమ్మెల్యే కొత్తగా ఆలోచించారట. ఈ ఘటనలో సీఐ, ఎస్ఐల పాత్రను తప్పుపడుతూ.. వారిని సస్పెండ్ చేయాలని సోషల్ మీడియాలో వైరల్ అవుతుందని చుట్టూ ఉన్నవాళ్లు చెప్పారట. అదేదో బాగుందని అనుకున్నారో ఏమో.. అప్పటికప్పుడు రావులపాలెం పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. సీఐ, ఎస్ఐలను సస్పెండ్ చేస్తేగానీ పోలీస్ స్టేషన్ నుంచి వెళ్లేది లేదని రాత్రి అక్కడే పడుకున్నారు.ఎమ్మెల్యేకి మద్దతుగా ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు రావడం.. డీఎస్పీ ఎమ్మెల్యేతో జరిపిన చర్చలు విఫలం కావడంతో సమస్య తీవ్రత పెరిగింది. జిల్లా ఎస్పీ సుధీర్ కుమార్‌రెడ్డి మాత్రం.. ఆ ఘటనలో పోలీసుల తప్పు లేదని.. సీఐ, ఎస్ఐలను సస్పెండ్ చేసేది లేదని తేల్చి చెప్పేశారట. పోలీస్ స్టేషన్‌కు వచ్చి ఎమ్మెల్యేతో మాట్లాడే ఉద్దేశం కూడా లేదని ఎస్పీ స్పష్టం చేశారట. మీ పొలిటికల్ ఇమేజ్ కోసం మమ్మల్ని బలిచేయొద్దని గట్టిగానే చెప్పారట ఎస్పీ. దాంతో జగ్గిరెడ్డి కొంత ఇబ్బంది పడినా.. మధ్యలో పోరాటాన్ని వదిలేస్తే ఇరకాటంలో పడతామని అనుకున్నారో ఏమో.. పోలీసుల తీరు వల్ల పార్టీకి, ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తోందనే అంశాన్ని చర్చకు పెట్టారు. పైగా గొడవ జరిగింది జగ్గిరెడ్డి సొంతూరులోనే కావడంతో వెనక్కి తగ్గలేదు.చివరకు ఏలూరు రేంజ్ డీఐజీ పాలరాజు రావులపాలెం వచ్చారు. ఎస్పీ మాత్రం రాబోనని చెప్పేశారట. పలు దఫాల చర్చల తర్వాత సీఐ, ఎస్ఐలను ఈ కేసులో జోక్యం చేసుకోకుండా చూస్తామని.. అడిషనల్ ఎస్పీతో విచారణ చేయిస్తామని డీఐజీ హామీ ఇచ్చారు. దాంతో జగ్గిరెడ్డి మెత్తబడ్డారట. సీఐ, ఎస్ఐలను సస్పెండ్ చేయాలనే డిమాండ్ నెరవేరకపోయినా.. కింద పడ్డా తనదే పైచెయ్యి అన్నట్టుగా సర్దుకుపోయారట ఎమ్మెల్యే జగ్గిరెడ్డి. తెగేవరకు లాగకుండా మధ్యలోనే సమస్యకు ఎండ్ కార్డు వేయడంతో ఎమ్మెల్యే సెల్ఫ్‌గోల్ వేసుకున్నారనే చర్చ ఊపందుకుంది.

## అధికార పార్టీ నేతల మధ్య కోల్డ్ వార్

గుంటూరు, జూలై 18, రాజకీయ ప్రత్యర్థులు ప్రస్తుతం ఒకే పార్టీలో ఉన్నా.. ఆ వైరం పోదు. కలిసి సాగలేరు. వెళ్దామన్నా ఇగోలు.. పాత గొడవలు అడ్డొస్తాయి. గుంటూరు జిల్లాలో ఆ ఇద్దరు అధికార పార్టీ నేతల మధ్య అదే జరుగుతోందట. పరస్పరం పైచెయ్యి సాధించేందుకు వారు వేయని ఎత్తుగడలు లేవంటున్నారు పార్టీ నాయకులు. ఇంతకీ ఎవరా నేతలు? ఏమా కథా?గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో రాజకీయాలు ఎప్పుడూ హాట్‌గానే ఉంటాయి. జిల్లాలోని కీలక నేతలంతా నివాసం ఉండేది ఇక్కడే. అందుకే పశ్చిమ అనగానే అందరి దృష్టీ పడుతుంది. 2014 ఎన్నికల్లో వెస్ట్ నుంచి టీడీపీ తరఫున మోదుగుల వేణుగోపాల్‌రెడ్డి, వైసీపీ నుంచి లేళ్ల అప్పిరెడ్డి పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో మోదుగుల గెలిచారు. ఐదేళ్లపాటు టీడీపీ అధికారంలో ఉన్నప్పటికీ తనకు ఎమ్మెల్యేగా సరైన ప్రాధాన్యం ఇవ్వలేదనే అసంతృప్తి మోదుగులలో ఉండేది. ఆ క్రమంలోనే టీడీపీని వీడి ఆయన వైసీపీలో చేరిపోయారు. కానీ.. లేళ్ల అప్పిరెడ్డితో సఖ్యత కుదరలేదు. వారి మధ్య అప్పటి నుంచి ఆధిపత్యపోరాటమే. అదే ఈ మూడేళ్లుగా రకరకాలుగా కొత్త పుంతలు తొక్కుతోంది.2019 ఎన్నికల్లో గుంటూరు వైసీపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేశారు మోదుగుల. స్వల్ప తేడాతో ఓడిపోయారు. అదే సమయంలో గుంటూరు పశ్చిమ నుంచి వైసీపీ తరఫున చంద్రగిరి ఏసురత్నం పోటీ చేసి ఓడిపోయారు. జగన్‌కు సన్నిహితంగా ఉండే అప్పిరెడ్డికి 2019లో పోటీ చేసే అవకాశం దక్కకపోయినా.. పార్టీ అధికారంలోకి వస్తే మంచి గుర్తింపు ఇస్తామన్న హామీ లభించింది. దాంతో ఆయన పోటీ చేయలేదు. పవర్‌లోకి రాగానే అప్పిరెడ్డిని ఎమ్మెల్సీని చేశారు సీఎం జగన్. ఎంపీగా ఓడిన మోదుగుల చేతిలో ఎలాంటి పదవి లేక డీలా పడ్డారు. ఏదో ఒక పదవి ఇస్తారన్న ఆశల్లోనే మూడేళ్లు గడిచిపోయింది.తనకు బంధువైన ఆళ్ల అయోధ్యరామిరెడ్డికి రాజ్యసభ సభ్యుడిగా జగన్ అవకాశం కల్పించడంతో మోదుగులకు నిరాశ తప్పలేదు. దీనికితోడు గుంటూరు వైసీపీలో మొదటినుంచి అప్పిరెడ్డి వైసీపీ హవా నడుస్తోంది. ఆయనకు బలమైన వర్గం కూడా ఉంది. మోదుగుల కూడా తనకంటూ ఒక వర్గాన్ని తయారు చేసుకున్నారు. దాంతో ఇద్దరి మధ్య అస్సలు పడటం లేదు. గుంటూరులో పోలీస్ పోస్టింగుల అంశంలో ఇద్దరి మధ్య గొడవలు తారాస్థాయికి వెళ్లాయి. ఓ సీఐ పోస్టింగ్ కోసం ఇద్దరూ చెరొకరి పేరును సిఫారసు చేశారు. వైసీపీ ప్లీనరీలో జరిగిన ఘటన అప్పిరెడ్డి, మోదుగుల మధ్య విభేదాలు మరోసారి చర్చల్లోకి వచ్చాయి. ప్లీనరీలో మోదుగుల చేసిన కామెంట్స్ చుట్టూనే అంతా ఆరా తీస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనైనా సెలక్షన్‌తో కాకుండా ఎలక్షన్‌లో గెలవాలని అప్పిరెడ్డిని ఉద్దేశించి అన్నారు మోదుగుల. దీనికి అప్పిరెడ్డి కౌంటర్ ఇచ్చారు. వైఎస్ఆర్ సమయంలో కొందరు కాంట్రాక్టు పనులు దక్కించుకుని తర్వాత పక్కకుపోయారని.. ఇప్పుడు జగన్ అధికారంలోకి రావడంతో మళ్లీ పార్టీలోకి వచ్చారని దెప్పి పొడిచారు. ఎన్నికల్లో గుంటూరు పశ్చిమ నుంచి టీడీపీ ఎమ్మెల్యేగా గెలిచిన మద్దాలి గిరి.. తర్వాత వైసీపీకి జై కొట్టారు. ఆయనకు ఏసురత్నంతో పొసగడం లేదు. ఇటు చూస్తే పశ్చిమకే చెందిన అప్పిరెడ్డి, మోదుగుల పరస్పరం కత్తులు దూసుకుంటున్నారు. దీంతో పశ్చిమ వైసీపీ రాజకీయాలు గరం గరంగా మారుతున్నాయి. మరి.. ఎన్నికల నాటికి ఈ ఆధిపత్యపోరాటం ఇంకెన్ని మలుపులు తీసుకుంటుందో చూడాలి.

## సోలో షోకే జనసేనాని మొగ్గు ?




విశాఖపట్టణం, జూలై 18, పవన్ కల్యాణ్ మాత్రం ఒక నిర్ణయానికి వచ్చినట్లే కనపడుతుంది. ఇప్పుడు కాకపోయినా ఎప్పుడైనా తాను ముఖ్యమంత్రి అవుతానని ఆయన గట్టిగా నమ్ముతున్నారు. పొత్తుల కోసం పాకులాడకుండా జనంలోకి వెళ్లి అత్యధిక స్థానాలను సాధించడమే లక్ష్యంగా పెట్టుకున్నారు. మండపేటలో జరిగిన బహిరంగ సభలో కూడా అభ్యర్థులు ఎవరైనా వారిని కాకుండా పవన్ కల్యాణ్ చూడమని ఆయన కోరడం వెనక కూడా అదే అర్థం దాగి ఉంది. 2024లో జనసేనకు అధికారం ఇవ్వాలని ఆయన కోరుతున్నా, ప్రజలు ఆలోచించుకోవాలని ఆయన నిర్ణయాన్ని వారికే వదిలేస్తున్నారు. కొద్ది నెలలుగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ రాజకీయ ధోరణిలో స్పష్టమైన మార్పు కన్పిస్తుంది. వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకతను తన వైపు తిప్పుకోవడానికి కొంత ప్రయత్నం చేస్తున్నా, తనను నమ్మమని ఆయన కోరుతున్నారు. అవసరమైతే 2008 నుంచి తన రాజకీయ వ్యవహార శైలిని పరిశీలించమని పవన్ కల్యాణ్ ప్రజలను కోరుతున్నారు. గత ఎన్నికల్లో తాను రెండుచోట్ల ఓటమి పాలయ్యాయని అయినా తాను ప్రజా సమస్యల కోసమే పోరాడుతున్నానన్న సంకేతాలను ప్రజల్లోకి పంపుతున్నారు. ఒకరకంగా సింపతీని క్రియేట్ చేసుకున్నట్లే కన్పిస్తుంది.మరోవైపు గతంలో ఆయన తన ఉపన్యాసాల్లో టీడీపీ గురించి ప్రస్తావించేవారు. కానీ ఇప్పుడు ఆ పార్టీ ఊసే ఎత్తడం లేదు. తనను మాత్రమే గెలిపించాలని కోరుతున్నారు. అటు విమర్శలు చేయడం లేదు. ఇటు పొత్తుల అంశాన్ని కూడా ప్రస్తావించడం లేదు. అది రాయలసీమ అయినా, కోస్తాంధ్రలోనైనా, తూర్పు గోదావరి జిల్లాలోనయినా ఆయన పార్టీ ఆవిర్భావ సభలో చెప్పినట్లు వైసీపీ వ్యతిరేకత ఓట్లన్నీ ఏకం చేస్తానని చెప్పడం లేదు. తన పార్టీని గెలిపిస్తారో? లేదో? మీరే ఆలోచించుకోవాలని ఆయన ప్రజలనున కోరుతున్నారు. గతంలో పవన్ కల్యాణ్ మూడు ఆప్షన్లు ఇచ్చారు. ఒకటి జనసేన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం, రెండు బీజేపీ, జనసేన ప్రభుత్వాన్ని ఏరప్?టు చేయడం. మూడో ఆప్షన్ జనసేన, బీజేపీ, టీడీపీ కలసి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం. కానీ పవన్ ఇప్పుడు ఒక్క ఆప్షన్ నే ఎంచుకున్నట్లు కనపడుతుంది. అది తొలి ఆప్షన్ మాత్రమే. ఆయన ధోరణి, ప్రసంగాల తీరు చూస్తుంటే ఒంటరిగానే బరిలోకి దిగాలని భావిస్తున్నట్లు కనపడుతుంది. అప్పుడే తాను అనుకున్న లక్ష్యాలను చేరుకోగలనని, పొత్తులతో ప్రభుత్వాలను ఏర్పాటు చేసినా అందులో బాసిజం ఉంటుందని, తమ మాట ఎంతవరకూ చెల్లుతుందోనన్న ఆలోచనకు ఆయన వచ్చినట్లున్నారు. అందుకే ఎప్పటికైనా జనసేన అధికారంలోకి రాకపోదా? అన్న ఆశతో ఉన్నారు.

## ఓటు బ్యాంక్ ప్రయత్నాలు

విజయవాడ, జూలై 18, తెలుగుదేశం పార్టీ ఓటు బ్యాంకు ఇప్పుడు ఎక్కడ ఉంది? ఆ పార్టీకి అసలు ఓటు బ్యాంకు ఉందా? లేదా? అన్న చర్చ బలంగా జరుగుతుంది. తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ లో బలమైన రాజకీయ పార్టీ. చంద్రబాబు విజన్ ఉన్న నేత. దానిని ఎవరూ కాదనలేరు. కానీ ఈసారి పార్టీకి ప్రత్యేక ఓటు బ్యాంకు అంటూ లేకుండా పోయిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తితో చంద్రబాబుకు ఓట్లు టర్న్ అవ్వొచ్చేమో కాని, దానికంటూ ఒక స్థిరమైన ఓటు బ్యాంకు ఇప్పుడు ఏపీలో లేకుండా పోయిందన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి. తెలుగుదేశం పార్టీ అంటేనే బీసీల పార్టీగా ముద్ర ఉండేది. ఎన్టీఆర్ పార్టీ పెట్టిన నాటి నుంచి అత్యధిక శాతం ఉన్న బీసీలకు రాజకీయంగా ప్రాధాన్యత ఇవ్వడమే కాకుండా అనేక పథకాలు కూడా ప్రవేశపెట్టి జెండాకు దగ్గర చేర్చాయి. 2014 ఎన్నికల వరకూ బీసీలు టీడీపీ వైపు ఉన్నారు. అయితే 2019 ఎన్నికల నాటికి జగన్ బీసీలను తన వైపునకు తిప్పుకోగలిగారు. జగన్ పార్టీకి ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల మద్దతు ఉంది. కాంగ్రెస్ నుంచి ఆ వర్గాలను తాను ట్రాన్స్ ఫర్ చేసుకోగలిగాడు. అదే సమయంలో మొన్నటి ఎన్నికల్లో బీసీ వర్గాలను ప్రసన్నం చేసుకోగలిగాడు. అందుకే అంత మెజారిటీ. ఇక అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జగన్ బీసీ జపం తప్ప మరేదీ చేయడం లేదు. పదవుల దగ్గర నుంచి నామినేటెడ్ పనుల వరకూ బీసీలకు ప్రాధాన్యత ఇస్తుండటంతో ఆ వర్గం చాలా వరకూ వైసీపీ వైపు మొగ్గు చూపుతోంది. బీసీ నేత ఆర్ కృష్ణయ్య కు కూడా రాజ్యసభ పదవి ఇచ్చారు. . ఇక చంద్రబాబు పార్టీకి ప్రత్యేకంగా ఒక వర్గం అంటూ లేకుండా పోయింది. వచ్చే ఎన్నికల్లో కాపులు కూడా పవన్ కల్యాణ్ వైపు మొగ్గు చూపుతారు కాని టీడీపీ వైపు చూడరు. ఇక బ్రాహ్మణ, వైశ్య, కమ్మ, క్షత్రియ సామాజికవర్గాలు మాత్రం ఒకింత చంద్రబాబు వైపు చూసే అవకాశముంది. వాటిలో కూడా పూర్తిగా చంద్రబాబు వైపు లేరు. మెజారిటీ శాతం ఉన్నారని చెప్పొచ్చు. అయితే ఈ వర్గాలు ఎవరూ పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓటు వేయని పరిస్థితి. పోలింగ్ కేంద్రాల వద్ద రష్ ఉంటే ఈ వర్గాలు అటు వైపు కూడా రారన్నది కాదనలేని వాస్తవం. అందుకే చంద్రబాబు భయమంతా ఇప్పుడు పోయిన వర్గాలను దగ్గరకు చేర్చుకోవడమే.బీసీలను దరిచేర్చుకునేందుకు... ప్రధానంగా బీసీలను దరి చేర్చుకోవడానికి ఆయన ఖచ్చితంగా ప్రయత్నిస్తారు. ఆయన ఎన్నికల మ్యానిఫేస్టోలోనూ వారికి పెద్దపీట వేస్తారు. స్పష్టమైన హామీలను వారికి ఇవ్వనున్నారు. ఏపీలో బీసీలు బలంగా ఉన్నారు.

## జగ దీప్ కు వైసీపీ జై

విజయవాడ, జూలై 18, ఎవరన్నా అవసరంలో వున్నపుడు మద్దతుకోసం అడుగుతారు. మనకు వీలున్నంతవరకూ ఇబ్బంది లేదనిపిస్తే ఓకే అంటాం. ప్రస్తుత రాజకీయపరిస్థితుల్లో బిజెపి, వైసీపీ స్నేహం ఆంధ్రప్రదేశ్ లో సీఎం జగన్‌కు చాలా అవసరం గనుక ఉప రాష్ట్రపతి పదవికి తమ అభ్యర్థిగా బిజెపి జగదీప్ దినకర్‌ను ప్రకటించగానే ఇక్కడనుంచి జగన్ ఓకే అని మద్దతు ప్రకటించేశారు. అంతేకాదు వైసీపీ ఎంపీ విజయసాయి రెడ్డి జగదీప్‌గారికి శుభాకాంక్షలు తెలుపుతూ ఆదివారం ఏకంగా హిందీలో ట్వీట్ చేయడమూ అయిపో యింది. రైతు బిడ్డ జగదీప్ ధనకర్‌ని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ప్రకటించినందుకు తనకు చాలా సంతోషం కలిగించిందని ఆయన పేర్కొన్నారు. జగదీప్ ధన్‌కర్‌ని ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా బీజేపీ చీఫ్ జేపీ నడ్డా ప్రకటించిన కొన్ని గంటల్లోనే ఆయనకు మద్దతు తెలిపింది వైఎస్సార్సీపీ.వైఎస్సార్సీపీ కీలక నిర్ణయం తీసుకుంది. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఎన్డీయే అభ్యర్థి జగ్‌దీప్ ధన్‌కర్ కే జైకొట్టింది. రాష్ట్రపతి ఎన్నిక ల్లోనూ బీజేపీ అభ్యర్థి ద్రౌపది ముర్ముకు మద్దతు తెలిపిన వైఎస్సార్సీపీ ఇప్పుడు ఉపరాష్ట్రపతి అభ్యర్థి విషయంలోనూ అలాంటి నిర్ణయాన్నే తీసుకుంది. అయితే అందరికంటే ముందుగానే జగన్ మద్దతు తెలియజేయడం అందర్నీ ఆశ్చర్యపరుస్తోంది. వాస్త వానికి జగన్ పార్టీ తరఫున ఇంకా ఓకే అనకపోయినా, విజయసాయి రెడ్డి మద్దతు ప్రకటన పార్టీపరంగా చెప్పినట్టేనని విశ్లేష కులు అనుకుంటున్నారు. విజయసాయిరెడ్డి ప్రస్తుతం వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేతగా ఉన్నారు. రాజ్యసభలో వైసీపీకి ప్రాతి నిధ్యం వహిస్తున్నారు. ఈ క్రమంలోనే విజయసాయిరెడ్డి వ్యాఖ్యలను వైసీపీ అధికారిక ప్రకటనగానే భావించవచ్చు.ద్రౌపది ముర్ముకు వైసీపీ మద్దతు విషయంలో కొంత వివాదం జరిగిన విషయం తెలిసిందే. మేం అడగకుండానే వైసీపీ మద్దతు ఇచ్చిందని బీజేపీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్ చేసిన కామెంట్స్ వివాదాస్పదమయ్యాయి. ఆయన వ్యాఖ్యలపై విరుచు కుపడిన వైసీపీ నేతలు బీజేపీ హైకమాండ్ కోరితేనే తాము మద్దతు తెలిపినట్లు ఎదరుదాడికి దిగారు. ఆ తర్వాత ఈ అంశంపై కేంద్రమంత్రి గజేంద్ర షెకావత్ కూడా స్పందించారు. ముర్ముకు మద్దతు ఇవ్వాలని తాము వైసీపీని కోరామని స్పష్టంచేశారు. సత్యకుమార్ వ్యాఖ్యలతో పార్టీకి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఐతే ఇప్పుడు మాత్రం అడగకుండానే జగదీప్ ధన్‌కర్‌కి వైసీపీ మద్దతు ఇచ్చినట్లు తెలుస్తోంది.ఇక, తెలంగాణ అధికార పక్షం టిఆర్ ఎస్ విషయానికి వస్తే, నరేంద్ర మోదీయే టార్గెట్‌గా కేసీఆర్ విమర్శలు గుప్పిస్తున్నారు. అందుకే రాష్ట్రపతి ఎన్నికల్లో ముర్ముకు కాకుండా.. విపక్షాల అభ్యర్థి యశ్వంత్ సిన్హాకు మద్దతునిచ్చారు. ఆయన హైదరాబాద్ వచ్చినప్పుడు ఘన స్వాగతం పలికి పెద్ద ఎత్తున ర్యాలీ నిర్వహించారు. మరి ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో ఏ నిర్ణయం తీసుకుంటార న్నది ఆసక్తికరంగా మారింది. ఈసారి కూడా విపక్షాల అభ్యర్థికే మద్దతు తెలుపుతారా? లేదంటే బీజేపీ రైతు బిడ్డగా చెబుతున్న జగదీప్‌కు జైకొడతారా? అన్నది తెలియాల్సి ఉంది.

## సిక్కోలులో 3 గ్రూపులు.. ఆరు వర్గాలు

శ్రీకాకుళం, జూలై 18, మూడు గ్రూపులు.. ఆరు వర్గాలు. ఎవరి కుంపటి వారిదే. అధిష్ఠానం మందలించినా నేతల తీరు మారడం లేదట. అదేదో సాధారణ నియోజకవర్గం కాదు. పెద్ద పొజిషన్‌లో ఉన్న సీనియర్ పొలిటీషియన్ సెగ్మెంట్ కావడంతో రచ్చ రచ్చ అవుతోంది. శ్రీకాకుళం జిల్లాలోని 8 నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో ఆరుచోట్ల వైసీపీ పాగా వేసింది. గెలిచిన కొత్తలో బాగానే ఉన్నా.. ఆ ఆరు చోట్లా ఎమ్మెల్యే పేరు చెబితేనే కస్సు మంటున్నారు పార్టీ నాయకులు. ఆమదాలవలస నియోజకవర్గంలో ఈ అసమ్మతి పోరు మరీ ఎక్కువగా ఉందట. ఇక్కడ నుంచి గెలిచిన తమ్మినేని సీతారాం.. స్పీకర్‌గా పెద్ద పొజిషన్‌లో ఉన్నారు. కానీ.. సెగ్మెంట్‌లో వైసీపీని మూడు గ్రూపులు లీడ్ చేయడం చర్చగా మారుతోంది. ఒక గ్రూప్ తమ్మినేని.. మరో గ్రూప్ పార్టీ నేత చింతాడ రవికుమార్, మూడో గ్రూప్‌కు సువ్వారి గాంధీ నాయకత్వం వహిస్తున్నారట. టీడీపీ కంటే.. తమ్మినేని వర్గంపై మిగతా ఇద్దరు నేతలు చేస్తున్న విమర్శలే చాలా పదునుగా ఉంటున్నాయట. సోషల్ మీడియాలో ఓ రేంజ్‌లో ఆడేసుకుంటున్నారు.తమ్మినేనితో విభేదించిన కోట బ్రదర్స్ వంటి ద్వితీయ శ్రేణి నాయకులను గాంధీ, రవికుమార్ ప్రోత్సహిస్తున్నారనే వాదన ఉంది. దీంతో ఆమదాలవలస, పొందూరు, భూర్జ, సరుబుజ్జిలి మండలాల్లో ఈ ముగ్గురు నేతలకు అనుచర గణం ఉంది. పార్టీ కార్యక్రమాలను కలిసి నిర్వహించే పరిస్థితి లేదు. ఇదే కాదు.. ఆమదాలవలసలో ఎవరికి వారే వైసీపీ ఆఫీసులు పెట్టేసుకున్నారు కూడా. ఆ మధ్య నిర్వహించిన నియోజకవర్గ వైసీపీ ప్లీనరీకి గాంధీ, రవి ఇద్దరూ డుమ్మా కొట్టేశారు. జిల్లా స్థాయిలో నిర్వహించిన ప్లీనరీకి మాత్రం ఇద్దరూ హాజరయ్యారు. అంతేకాదు.. తమ్మినేని కంటే ఎక్కువ మందిని జిల్లా ప్లీనరీకి తీసుకెళ్లారని పార్టీ వర్గాల్లో చర్చకు పెట్టేశారు.అసమ్మతి వర్గాన్ని తమ్మినేని ఎందుకు కలుపుకొని వెళ్లడం లేదని పార్టీ కేడర్ ప్రశ్నిస్తోంది. సమస్యను పెంచుకుంటున్నారే తప్ప.. పరిష్కారానికి చొరవ తీసుకోవడం లేదని చెవులు కొరుక్కుంటున్నారు. ఇలాగే ఉపేక్షిస్తే ఎన్నికల నాటికి అసమ్మతి ఇంకెలాంటి తీవ్ర రూపు దాల్చుతుందో అని వైసీపీ శ్రేణులు ఆందోళన చెందుతున్నాయట. తమ్మినేని పాల్గొనే కార్యక్రమాలకు ఆ ఇద్దరూ రావడం లేదు. దాంతో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంపైనా ఆ ప్రభావం కనిపించింది. అలా అని అసమ్మతి వర్గాలు మౌనంగా ఉండటం లేదు. వారి స్థాయిలో వారు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తమ్మినేనిపై వారే విమర్శలు చేస్తుండటంతో టీడీపీకి పెద్దగా పనిలేకుండా పోయింది. ఈ సమస్య అధిష్ఠానం దృష్టిలో ఉండటంతో వారే చికిత్స చేస్తారని ఆశిస్తున్నారు. మరి.. ఆ టైమ్ ఎప్పుడొస్తుందో చూడాలి.

## హైకోర్టు న్యాయవాదిగా బద్వేల్ మాజీ ఎమ్మెల్యే జయరాములు

బద్వేలు హైకోర్టు న్యాయవాదిగా బద్వేల్ మాజీ ఎమ్మెల్యే తిరువీధి జయరాములు బాధ్యతలు చేపట్టారు ఎమ్మెల్యే కాకముందు జయరాములు నెల్లూరు జిల్లా గూడూరు మున్సిపల్ కమిషనర్ గా కడప జిల్లా పులివెందుల మున్సిపల్ కమిషనర్ గా పని చేశారు 2014 ఎన్నికల్లో బద్వేల్ అసెంబ్లీ స్థానం నుంచి వైకాపా అభ్యర్థిగా పోటీ చేసి విజయం సాధించారు ఆ తర్వాత జరిగిన రాజకీయ పరిణామాల్లో ఆయన అధికార తెలుగుదేశం పార్టీలో చేరారు ప్రస్తుతం ఆయన బిజెపిలో కొనసాగుతున్నారు 2019లో బిజెపి అభ్యర్థిగా బద్వేల్ నుంచి పోటీ చేశారు ఇప్పుడు బిజెపి పార్టీలో రాష్ట్రస్థాయిలో కీలకపాత్ర పోషించడంతో పాటు క్రియాశీలక పదవిలో ఉన్నారు బద్వేలు నియోజకవర్గ వాసులకు ఉచితంగా సేవలు అందిస్తానని మాజీ ఎమ్మెల్యే జయరాములు చెప్పడం జరిగింది

## అనంతలో శంకర్ నారాయణ్ కు అవమానం

అనంతపురం, జూలై 18,పాలన బాగుంటే అందరూ ఆదరిస్తారు. పాలన బాగుంటే అందరికీ గౌరవం లభిస్తుంది. కబుర్లు చెబుతూ పబ్బం గడుపుదామనుకుంటే అవమానాలకు సిద్ధం కావాలి. కానీ ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రభుత్వం ప్రజల ఆగ్రహాన్ని అంత సీరియస్‌గా తీసుకోవడం లేదన్నది మరోసారి రుజువయింది. గడప గడపకు అనే కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, మంత్రులు ప్రజల నుంచి తిరుగుబాటు, అవమానాలు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం చేస్తున్న కార్యక్రమాలు, అందిస్తున్న పథకాల ఫలాల గురించి వాకబు చేయడానికి వెళుతోన్నవారికి ప్రజల నుంచి తిట్ల దండకమే పడుతోంది. తాజాగా శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నియోజకవర్గంలోని శెట్టిపల్లి తండాలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మంత్రి, వైసీపీ ఎమ్మెల్యే శంకర నారాయణకు చేదు అనుభవం ఎదురైంది. వితంతు పింఛన్‌ను రద్దు చేసినందుకు ఓ గిరిజన మహిళ రగిలిపోయింది. తన ఇంటి వద్దకు ఇంకోసారి వస్తే చెప్పుతో కొడతానని హెచ్చరించింది. పెనుకొండ మండలం శెట్టిపల్లి తండాకు అధికారులు, పార్టీ నాయకులతో కలిసి శంకర నారాయణ గడపగడపకు కార్యక్రమం నిర్వహించారు. ప్రజల సమస్యలను తెలుసుకునేందుకు ఇంటింటికీ వెళ్లారు. ఈ క్రమంలో లలితాబాయి ఇంటి వద్దకు చేరుకోగానే ఆమె బంధువులు పింఛన్ రద్దు విషయాన్ని ఎమ్మెల్యేకు తెలియజేశారు. ఇంతలో లలితా బాయి అనే మహిళ బయటకు వచ్చి తన భర్త ఆనందనాయక్ పదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడని, అప్పటి నుంచి తనకు వితంతు పింఛన్ వచ్చేదని తెలిపింది.స్థానిక వైసీపీ నాయకులు తనకు పింఛన్ రాకుండా చేశారని, 11 నెలల నుంచి పింఛన్ అందడంలేదని ఎమ్మెల్యేకి వివరిం చింది. అంతా విన్న ఎమ్మెల్యే, తరువాత చూద్దాంలే.. అని చెప్పి, తేలిగ్గా తీసుకుని ముందుకు వెళ్లిపోయారు. దీంతో లలితా బాయి రగిలి పోయింది. ఏమిచ్చి పోగొట్టుకున్నారని మా ఇంటికాడికి వచ్చినార్రా.. ఇంకోసారి మా ఇంటి ముందుకొస్తే చెప్పుతో కొడతా. ఒకసారి మా ఇంటిని చూడండిరా..అని ఆగ్రహం వ్యక్తంచేసింది. నీకు దమ్ము, ధైర్యం ఉంటే ఇక్కడికి రా.. అని ఎమ్మెల్యేపై తొడ కొట్టింది.శెట్టిపల్లికి చెందిన లలితాబాయి, ఆనందనాయక్ దంపతులకు ఒక కొడుకు, ఒక కూతురు ఉన్నారు. ఆనంద్ పదేళ్ల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. భర్త చనిపోయాక లలితాబాయి కూలి పనులకు వెళ్లి బిడ్డలను పోషించింది. స్థానికంగా పనులు లేనప్పుడు బెంగళూరుకు వలస వెళ్లి వస్తుంటుంది. స్థానికంగా ఉండదన్న సాకుతో వైసీపీ నేతలు ఆమె పింఛన్‌ను రద్దు చేయించినట్లు తెలిసింది.ఈ విషయాన్నే విన్నవించినా ఎమ్మెల్యే తేలిగ్గా తీసుకోవడంతో లలితాబాయి ఆగ్రహాన్ని చవిచూడాల్సి వచ్చింది.

## ఆషాడం ఆకుకూరకు డిమాండ్

విశాఖపట్టణం, జూలై 18, వాళ్ళంతా అమాయక అడవి బిడ్డలు. విసిరి పారేసినట్టుండే గూడెల్లో వారి జీవనం. అడవి తల్లిని నమ్ముకుని వారి జీవనయానం. అటువంటి మన్యంలో గిరిజన సంప్రదాయం అందరికీ కట్టిపడేస్తుంది. గిరిజన ఆచార వ్యవహారాలతో పాటు నోరూరించే వంటకాలు అందర్నీ ఆకట్టుకుంటాయి. ఈ కోవకే చెందుతుంది అషాడంలో వండే ఆకు కూర..! అదేంటి.. ఆషాడం ఆకు కూర ఏంటి అని అనుకుంటున్నారా..? అయితే ఈ సీజన్లో దొరికే ప్రత్యేకమైన ఆ కర్రీ విశేషాలు ఏమిటంటే..అల్లూరి జిల్లా మన్యంలో ఆకుకూరలకు విశేష ప్రాముఖ్యత ఉంది. అదీ కూడా నిత్యం లభించే, పండించే ఆకుకూరలు కాదు.. సీజన్ లో ప్రత్యేకంగా ఉండే ఆకులు, పూలతో వంటకాలు ఈ అడవి బిడ్డల సొంతం. ఇక ఆషాడ మాసం వచ్చిందంటే చాలు.. ఈ సీజన్లో ఏజెన్సీలో విరివిగా దొరికే ఆ ఆకులను సేకరించే పనిలో ఉంటారు గిరిజనులు. ప్రతియేటా ఈ మాసంలో ఈ కూరకు భలే గిరాకీ ఉంటుంది. ఇష్టపడి మరీ గిరిజనులంతా దీన్ని సేకరించేందుకు పోటీపడతారు. ఏజెన్సీలో కలగంటి, బొమ్మ తట్టెడు, కప్పకూర లాంటి ఆకుకూరలు ఆషాడ మాసంలో ఎక్కువగా చిగురిస్తాయి. ఈ చెట్లు చాలా వరకు పెరట్లోనే ఉంటాయి. మరికొన్ని మెట్ట ప్రాంతాల్లోను రోడ్డు కు ఇరువైపులా గిరిజన గ్రామాల్లో విస్తరించి ఉన్నాయి. ఆషాడ మాసంలో వర్షాలు ప్రారంభం అయినప్పుడు ఈ కూరల వంటకాలు మొదలవుతాయి. ఆకులను కోసి కూరను వండడం ఆనవాయితీ. అంతేకాదు ఆ కూరను ఇంటిల్లిపాది ఇష్టంగా ఆరగిస్తారు. లొట్టలు వేసుకుని మరి ఆహా ఏమి రుచి అంటూ తింటారు. పిల్లలు పెద్దలు కలిసి కూర ఆరాగిస్తామని గిరిజన వాసులు చెబుతున్నారు.అయితే గిరిజనులు పవిత్రంగా భావించే కూర ఈ సీజన్లోనే తినడం వెనుక ఓ ప్రత్యేకత కూడా ఉందట?! పోషకాలు పుష్కలంగా ఉండే ఈ కూర .. కేవలం వంటకంగా మాత్రమే కాకుండా దివ్య ఔషధంగా కూడా భావిస్తారు గిరిజనులు. ఈ కూర తింటే ఈ సీజన్లో వచ్చే వ్యాదులు దరి చేరవన్నది గిరిజనుల విశ్వాసం. ఈ కలగంటి, బొమ్మ తట్టెడు, కప్పకూరలో ఇమ్యూనిటీ పవర్ పెంచే గుణం ఉంటుందని వాదన. పవిత్రంగా భావించే ఈ ఆషాడం కూరను పెసర పప్పు కలిపి వంటకాలు చేస్తారు. వాటిని అమ్మవారికి నైవేద్యంగా కుడా పెడతారు అడవి బిడ్డలు. ఇలా చేయడం వల్ల అనారోగ్య సమస్యల నుంచి బయటపడతామని విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ఆకు కూరలతో కూరలు మాత్రమే కాదు.. వేర్వేరు రకాల వంటకాలు కుడా చేస్తారు.ఆషాడం మాసంలో దొరికే గిరిజనుల స్పెషల్ డిష్ ఆషాడం ఆకు కూర. ఎప్పుడైనా ఈ సీజన్ లో మన్యం ఏజెన్సీ కి వెళ్తే మాత్రం ఓ సారి ఈ కూర టేస్ట్ ను ఆస్వాదించండి.

## 21న కాంగ్రెస్ చలో విజయవాడ

కడప నేషనల్ హెరాల్డ్ పత్రిక సంబంధించి తప్పుడు రాతలతో కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీకి ఈడి నోటీసులు పంపించడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ పిలుపుమేరకు ఈనెల 21వ తేదీ విజయవాడలోని ధర్నా చౌక్ లో కాంగ్రెస్ శ్రేణులు ధర్నా నిర్వహించనున్నట్లు, కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా అధ్యక్షుడు నీలి శ్రీనివాసరావు తెలిపారు.సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, బిజెపి దుష్ట బుద్ధితో గతంలో కాంగ్రెస్ నాయకుడు రాహుల్ గాంధీని అనేకసార్లు ఈడి ముందుకు హాజరు పరిచి, గంటల తరబడి విచారణ చేసిన విషయం గుర్తు చేశారు.21వ తేదీ సోనియా గాంధీ ని ఈడి ముందు హాజరు కావాలని నోటీసులు పంపించడం, దేశంలో ప్రతిపక్షాల ఉనికిని దెబ్బతీయటమే అన్నారు.రాజ్యాంగ సంస్థలను అడ్డుపెట్టుకొని కాంగ్రెస్ పార్టీని నిర్వీర్యం చేయాలని చూస్తే అది జరగని పని అన్నారు.దేశం కోసం ప్రాణాలు అర్పించిన నేతలు ఉన్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అన్నారు.నల్ల రైతు చట్టాలతో రైతులని ఇబ్బంది పెట్టిందన్నారంబిజెపి కులాలు ,మతాల పేరుతో దేశాన్ని విభజిస్తుంటే,కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర ద్వారా కాశీ నుంచి కన్యాకుమారి వరకు పాదయాత్ర నిర్వహిస్తారన్నారుకార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మల్లం విజయభాస్కర్, ఎన్ ఎస్ యు ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుమలేష్, కార్యదర్శి సుబ్బారెడ్డి, హ్యూమన్ రైట్స్ జిల్లా అధ్యక్షుడు పాలగిరి శివ, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోర్ల శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి సాదికలి, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు ఆనంద్, బీసీ సెల్ నగర అధ్యక్షుడు వేణుగోపాల్, సూర్యుడు పాల్గొన్నారు

# వరద– బురద



ఏలూరు, జూలై 18,ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరి, శబరి నదులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో అల్లూరి సీతారామరాజు జిల్లా పోలవరం నిర్వాసిత మండలాలైన విఆర్.పురం, కూనవరం, ఎటపాక, చింతూరుల్లో వరద పెరుగుతోంది. బాహ్య ప్రపంచంతో చాలా ఊళ్లకు సంబంధాలు తెగిపోయాయి. వేలాది మంది నిరాశ్రయులయ్యారు. వందలాది గ్రామాల్లో విద్యుత్తు సరఫరా నిల్చిపోయింది. భద్రాచలం వద్ద నీటిమట్టం 50 అడుగులకు చేరితే విద్యుత్తు సరఫరా పునరుద్ధరించే అవకాశముంటుందని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం అరకొరగా ఏర్పాటు చేసిన పునరావాస కాలనీల్లో సౌకర్యాలు కరువవడంతో బాధితులు నిద్ర సైతం కరువైంది. విఆర్.పురం మండలంలోని బాధితులు వరద పోటు నుంచి తప్పించుకునేందుకు ఇళ్లను వదిలి గుట్టలపైకి ఎక్కి సొంత డబ్బులతో గుడారాలు వేసుకుని బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ప్రభుత్వం టార్పాలిన్లు సైతం ఇవ్వకపోవడంతో బాధితులే వాటిని కొనుక్కుంటున్నారు. వారం రోజులుగా విద్యుత్తు సరఫరా లేకపోవడంతో అంధకారంలోనే గడుపుతున్నారు. ప్రభుత్వం కొంత మందికి 25 కిలోల బియ్యం ఇచ్చి చేతులు దులుపుకుంది. ప్రభుత్వం నిత్యావసర సరుకులను, కొవ్వొత్తులను వీరికి అందించలేదు. సాయంత్రం ఐదు గంటలు తరువాత వీరంతా అంధకారంలోనే జీవిస్తున్నారు. దోమలు విపరీతంగా కుడుతున్నాయని, రెప్పవేయలేకపోతున్నామని బాధితులు చెబుతున్నారు. ఈ మండలంలో 60 గ్రామాలకు గత ఆదివారం నుంచి విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. పునరావాస కేంద్రాల్లోనూ ఇదే పరిస్థితి ఉంది. జనరేటర్ ఏర్పాటు కూడా లేదు. కూనవరం మండలంలోని పలు గ్రామాల ప్రజలు కోతులగుట్టకు, విఆర్.పురం మండలంలోని రేఖపల్లికి ఎక్కువ మంది వెళ్లిపోయారు. ఈ మండలంలోని 52 గ్రామాలకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. చింతూరులో 80 గ్రామాల ప్రజలు ముంపులోనే ఉన్నాయి. గోదావరి, శబరి ఉధృతి మరింతగా పెరుగుతుండడంతో బాధితులు సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీస్తున్నారు. వందేళ్లలో ఇంతటి వరదలను ఎప్పుడూ చూడలేదని చర్చించుకుంటున్నారు.

జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వారం రోజులుగా చింతూరులోనే ఉండి ముంపు మండలాల పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు.ఎటపాక మండలంలో 35 వరద ప్రభావిత గ్రామాలు ఉండగా వాటిలో 24 నీట మునిగాయి. సుమారు 13 వేల మంది నిరాశ్రయులయ్యారు. నాలుగు వేల ఇళ్లలోకి వరద నీరు చేరిందని అధికారులు తెలిపారు. నిర్వాసితులందరినీ సురక్షిత ప్రాంతాలకు తరలించామని అధికారులు చెప్తున్నా, వరద అంచనా సమాచారం సైతం అధికారులు తెలపలేదని, స్వచ్ఛందంగా తామే ఇళ్లను విడిచి సురక్షిత ప్రాంతాలకు వచ్చామని బాధితులు వాపోతున్నారు. మూడు రోజులుగా కరెంట్ లేకపోవడంతో సెల్‌ఫోన్లు మూగబోయాయని, సామాజిక మాధ్యమాల్లో ఇస్తున్న సమాచారం కూడా తెలియడం లేదని వరద బాధితులు అంటున్నారు. గుండాల గ్రామంలో చిక్కుకున్న 80 మందిని శుక్రవారం అర్ధరాత్రి ఎన్‌డిఆర్‌ఎఫ్ బృందాల సాయంతో గుండాల కాలనీ గ్రామంలోని పునరావాస కేంద్రాలకు తరలించారు. భద్రాచలాన్ని ఆనుకుని ఉన్న ఎటపాకలో కరకట్టపైనుంచి వరద నీరు గ్రామంలోకి చేరడంతో ఆ గ్రామస్తులను స్థానిక ఇంజినీరింగ్ కళాశాలలోని పునరావాస కేంద్రానికి తరలించారు.

# దేశం గూటికి కిల్లీ

శ్రీకాకుళం, జూలై 18, వైసీపీ అధినేత జగన్ తీరుతో పార్టీలో అసమ్మతి భగ్గుమంటున్న సంకేతాలు బలంగా కనిపిస్తున్నాయి. ఆయన కేబినెట్ లో సీనియర్లు చిటపటలాడడమే కాదు.. పార్టీలో కూడా సీనియర్లు పక్క చూపులు చూస్తున్నారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గాన్ని తీసుకున్నా.. వైసీపీ సీనియర్లు పార్టీ తీరు పట్లా, అధినేత వ్యవహార శైలి పట్లా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వారే స్వయంగా తమ ఆంతరంగికుల వద్దా ఆ అసంతృప్తిని బహిర్గతం చేస్తున్నారు. వైసీపీలో జూనియర్, సీనియర్ అన్న తేడా లేదు. అందరి పరిస్థితీ ఒక్కటే ఏరు దాటే వరకూ ఓడ మల్లయ్య... ఏరు దాటేకా బోడి మల్లయ్య అన్న చందమే. మరీ ముఖ్యంగా కేబినెట్ పునర్వ్యవస్థీకరణ తరువాత కేబినెట్ లోనూ, పార్టీలోనూ కూడా సమస్యల చిక్కులు అధికమయ్యాయి. జగన్ అయిష్టంగా అయినా అనివార్యంగా కొనసాగించాల్సిన మంత్రులకు కేబినెట్ లోనే కాదు.. వారి వారి మంత్రిత్వ శాఖలకు చెందిన అధికారులలో కూడా పలుచన అయిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అలాగే పదవి ఆశించి దక్కక భంగపడిన నేతలు అప్పట్లో అసమ్మతి గళం వినిపించారు. ఆ తరువాత సముదాయించుకుని గతంలోలా పార్టీలో పని చేద్దామనుకున్నా.. అలా చేయలేని పరిస్థి తులను వారికి పార్టీ అధిష్ఠానమే కల్పిస్తోందని వైసీపీ శ్రేణుల్లోనే బలంగా వినిపిస్తోంది.అందుకు పలు ఉదాహరణలను కూడా వారు చూపుతున్నారు. ఇక శ్రీకాకుళం జిల్లాకు చెందిన సీనియర్ నేత కిల్లి కృపారాణిది అయితే మరో ప్రత్యేక సమస్య. కాంగ్రెస్ లో ఓ వెలుగు వెలిగి.. జెయింట్ కిల్లర్ గా గుర్తింపు పొంది కేంద్ర మంది పదవిని అలంకరించిన ఆమె హస్తం నుంచి వైసీపీలో చేరారు. ఆమెను జగన్ స్వయంగా పార్టీలోకి ఆహ్వానించి జిల్లా అధ్యక్ష బాధ్యతలు సైతం అప్పగించారు. అక్కడి దాకా బానే ఉంది. ఆయితే ఆమెకు వాగ్దానం చేసిన విధంగా ఏ నామినేటెడ్ పోస్టూ ఇవ్వలేదు.అయినా సద్దుకుని పార్టీ కోసం పని చేయాలని భావించిన ఆమెకు కేబినెట్ పునర్వ్యవస్థీకరణ తరువాత కష్టాలు చుట్టుముట్టాయి. పరాభవాలు ఎదురౌతున్నాయి. తనను పొమ్మన లేక పొగబెట్టినట్టుగా పార్టీ సీనియర్లు వ్యవహరిస్తున్నారని ఆమె ఎటువంటి దాపరికం లేకుండానే చెబుతున్నారు. కేబినెట్ పునర్వ్యవ స్థీకరణలో మంత్రి పదవి దక్కించుకున్న ధర్మాన ప్రసాదరావు తనను అడుగడుగునా ఇబ్బందులకు గురి చేస్తూ అవమానిస్తున్నారని ఆమె ఆరోపిస్తున్నారు.

ఈ విషయాన్ని అధినేత దృష్టికి తీసుకువెళ్లినా ఆయన పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గౌరవం లేని పార్టీలో ఉండటం కంటే వదిలి వెళ్లడమే మేలని ఆమె తన అనుచరులదగ్గరు ఓపెన్ అయ్యారు. అందుకు ప్రధాన కారణం ఇటీవల సీఎం జగన్ జిల్లా టూరులో ఆమెకు జరిగిన అవమానమే నంటున్నారు. ముఖ్యమంత్రి జగన్ కు ఆహ్వానం పలికేందుకు వెళుతున్న ఆమెను పోలీసులు అడ్డుకున్నారు. తాను కేంద్ర మాజీ మంత్రినని.. వైసీపీ సీనియర్ నాయకురాలినని చెప్పినా వారు వినలేదు. లోపలికి అనుమతించలేదు. దీంతో వెనుదిరిగి వెళ్లిపోయారు. తనకు జరిగిన పరాభవం వెనుక ధర్మాన ఉన్నారని ఆమె ఆరోపించారు. అంతే కాకుండా పార్టీ జిల్లా అధ్యక్ష పదవి నుంచి సైతం ఆమెను తొలగించడంతో.. వైసీపీలో ఇక కొనసాగడం తనకు సాధ్యం కాదని ఆమె బహిరంగంగానే చెబుతున్నారు. తెలుగుదేశం గూటికి చేరాలన్న ఆసక్తి ఉన్నట్లు ఆమె అనుచరులు చెబుతున్నారు.

## 2024లో జరిగే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయ దుందుభి కాయం

### వైకాపా పాలనతో ప్రజలు విసిగిపోయారు
### ఎన్నికల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారు
### బద్వేలు
### మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు
### గుర్రంపాటి వెంగలరెడ్డి

బద్వేలు 2024లో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో బద్వేలు నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ విజయ కేతనం ఎగురవేయడం ఖాయమని బద్వేలు మున్సిపాలిటీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గుర్రంపాటి వెంగళరెడ్డి ధీమా వ్యక్తపరిచారు గతంలో జరిగిన ఎన్నికలు వేరు జరగబోయే ఎన్నికలు వేరు అని ఆయన తెలిపారు వైకాపా మూడు సంవత్సరాల పాలనపై ప్రజలు అన్ని విధాలుగా విసుగెత్తి పోయారని ఆయన పేర్కొన్నారు సంక్షేమ పథకాల పేరుతో ప్రజలనుముఖ్యమంత్రి అన్ని విధాల బురిడి కొట్టించినట్లు వెంగల్రెడ్డి ఆరోపించారు సంక్షేమ పథకాలు కేవలం కొద్ది మందికి మాత్రమే అందుతున్నాయి తప్ప అర్హులైన వారికి పూర్తిస్థాయిలో అందడంలేదని ఆయన ఆరోపించారు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే రాష్ట్రంలోని అన్న క్యాంటీన్లు మూసి వేయించి పేదల ఉసురు పోసుకున్నట్లు ఆరోపించారు నిరుద్యోగులకు బృతి విద్యార్థులకు విదేశాల్లో చదువుకునే అవకాశాన్ని ముఖ్యమంత్రి గండి కొట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు ఉన్నప్పుడు తెలుగుదేశం పార్టీ హయాంలో అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేదని చెప్పారు కుల మతాలకతీతంగా ప్రతి పండగకు ఉచితంగా నిత్యవసర వస్తువులు పంపిణీ చేసే విషయాన్ని ఆయన గుర్తు చేశారు గత మూడేళ్లలో ఏ ఒక్కరికి ఈ పథకాలు ఎత్తివేసిన ఘనత కూడా జగన్మోహన్ రెడ్డికి దక్కుతుందన్నారు రైతులను జగన్ ప్రభుత్వం అన్ని విధాల మోసం చేస్తున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు వ్యవసాయ మోటార్లకు మీటర్లు ఏర్పాటు చేస్తామని జగన్మోహన్ రెడ్డి పదే పదే చెప్పడం రైతుల ఆగ్రహానికి కారణమైందన్నారు పేరుకే రైతుల సంక్షేమం అని చెబుతున్న ముఖ్యమంత్రి రైతులపై ఏమాత్రం శ్రద్ధ కనపరచడం లేదని అరోపించారు తెలుగుదేశం పార్టీ హయాములో ప్రజలంతా ఎంతో సంతోషంగా ఉండే వారిని కక్షలు కార్పన్యాలు ప్రజల మధ్య ఉండేవి కావన్నారు జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత ప్రతిపక్ష నేతలపై అనేక కేసులు బనాయించి వారిని జైలు పాలు చేయడమే గాక మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు రాష్ట్రంలో చదువుకుంటున్న బాలికలకు రక్షణ లేకుండా పోయిందన్నారు కళాశాలలకు వెళ్లిన బాలికలు నడిరోడ్డుపై దారుణ హత్యలకు గురవుతున్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు రాష్ట్రంలో ఇటీవల జరిగిన కొన్ని సంఘటనలు ఆయన ఉదాహరించారు నేరాలు అరికట్టే విషయంలో వైకాపా ప్రభుత్వం పూర్తిగా విఫలమైనట్లు వెంగల్రెడ్డి ఆరోపించారు సంపూర్ణ మద్య నిషేధం అమలు చేస్తామని ఎన్నికల ప్రచారంలో చెప్పిన జగన్ మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆ విషయాన్ని పూర్తిగా మర్చిపోయినట్లు ఆయన ఆరోపించారు అనేక విషయాలలో ప్రజలు జగన్మోహన్ రెడ్డి పాలనపై విసిగించింది ఉన్నారని తెలిపారు క్షేత్రస్థాయిలో తాము ప్రజల వద్దకు వెళ్ళినప్పుడు ఈ విషయాలన్నీ బయటికి వచ్చినట్లు తెలిపారు ఎన్నికల కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని ఓట్లు వారి చేతికి వస్తే వైకాపా పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నట్లు వెంగళరెడ్డి తెలిపారు బద్వేల్ మున్సిపాలిటీలోని 35 వార్డులలో తెలుగుదేశం పార్టీ ఎంతో బలంగా ఉందని పేర్కొన్నారు అన్ని వార్డులలో పార్టీ నాయకులు క్షేత్ర స్థాయిలో ప్రజల వద్దకు వెళ్లి వారి మనోభావాలు తెలుసుకున్నట్లు తెలిపారు బద్వేలు మున్సిపాలిటీలో దాదాపు 53 వేల మంది ఓటర్లు ఉన్నారు 64 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి ఓటర్లలో దాదాపు 70 శాతం మంది తెలుగుదేశం పార్టీ వైపు మొగ్గు చూపుతున్నారు ఒక విధంగా చూసుకుంటే బద్వేల్ పట్టణం మొదటినుంచి తెలుగుదేశం పార్టీకి కంచుకోటగా ఉంది కొన్ని తప్పిదాల వల్ల ఓటర్లు తెలుగుదేశం పార్టీపై అభిమానం ఉన్నప్పటికీ అటు ఇటు వెళ్లారు కానీ ఇప్పుడు పట్టణంలో పూర్తిగా పూర్వ పరిస్థితులు తెలుగుదేశం పార్టీకి వచ్చాయి ఆ పార్టీకి పెద్ద ప్లస్ గా మారింది ఒక ఓటర్లను ఆకట్టుకునే ప్రయత్నాలలో ప్రస్తుతం తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ఉన్నారు ఇదే విషయాన్ని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు వెంగళరెడ్డి తెలిపారు ఈసారి జరిగే ఎన్నికల్లో బద్వేల్ నియోజకవర్గం లో తెలుగుదేశం పార్టీ విజయాన్ని ఏ శక్తి కూడా అడ్డుకోలేదని ఆయన పూర్తి ధీమా కనపరిచారు

# అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు

కడప ప్రజా సమస్యల పరిష్కారార్థం ఏర్పాటు చేసిన "స్పందన" కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీదారుల సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని స్పందన హాల్లో.. ప్రజా ఫిర్యాదుల స్వీకరణ "స్పందన" కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు తో పాటు జాయింట్ కలెక్టర్ సాయికాంత్ వర్మ , ఇంఛార్జి డిఆర్వో, స్పెషల్ కలెక్టర్ రామమోహన్, డ్వామ, డిఆర్డిఏ పీడిలు యదుభూషన్ రెడ్డి, పెద్దిరాజు,..లు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ వి.విజయ్ రామరాజు మాట్లాడుతూ.... ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు .. క్షేత్ర స్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తిచెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. పెండింగ్ బియాండ్ ఎస్ఎల్ఏ, రీఓపెనింగ్.. లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించా లన్నారు. ఈ కార్యక్రమంలో సిపివో వెంకట రావు, ప్రొద్దుటూరు ఆర్టీవో వీర్రాజు, సమగ్ర శిక్ష పీడి ప్రభాకర రెడ్డి, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డా.నాగరాజు, రిమ్స్ సూపర్ ఇన్ టెండెంట్ డా.వెంకటేశ్వర రావు, ఎల్డిఎం దుర్గా ప్రసాద్, డీపీవో ప్రభాకర్ రెడ్డి, పంచాయతీ రాజ్ ఎస్ ఈ శ్రీనివాస రెడ్డి, ఆర్ ఑ బి ఎస్ ఈ మహేశ్వర రెడ్డి, జడ్పి సీఈఓ సుధాకర్ రెడ్డి, గృహనిర్మాణ శాఖ పీడి కృష్ణయ్య, ఎస్ సి కార్పొరేషన్ ఈడి వెంకట సుబ్బయ్య, జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖాధికారి బ్రహ్మయ్య, జిల్లా వ్యవసాయ శాఖాధికారి నాగేశ్వరరావు, జిల్లా ఉపాధి కల్పనాధికారి దీప్తి, అన్ని శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## వెండి బంగారు వర్తక సంఘం పట్టణ అధ్యక్షునిగా కట్టా సదానందం

పెద్దపల్లి, పెద్దపల్లి పట్టణ వెండి బంగారు వర్తక సంఘం అధ్యక్ష ఎన్నికను సంఘ భవనంలో జిల్లా స్వర్ణ కార సంఘం అధ్యక్షుడు శ్రీ రాం నర్సయ్య అధ్యక్షతన ఎన్నికల అధికారి కందుకూరి పూర్ణచారి నిర్వహించారు.ఈ ఎన్నికల్లో పదవికి కట్టా సదానందం, దేవరకొండ రాజు లు పోటీ పడగా కట్ట సదానందం విజయం సాధిం చారు. నూతన అధ్యక్షునిగా ఎన్నికైన కట్ట సదానందంకు పలువురు సంఘం సభ్యులు పూల మాలలు వేసి శాలువాలతో సత్కరించి శుభాకాం క్షలు తెలిపారు.ఈ సందర్బంగా నూతన అధ్యక్షుడు కట్ట సదానందం మాట్లాడుతూ సంఘ సబ్యులకు అందుబాటులో ఉంటూ సంఘం అభివృద్ధికి పాటు పడుతానన్నారు. ఈ కార్యక్రమం లో పట్టణ స్వర్ణ కార సంఘం నాయకులు,రాష్ట్ర నాయకులు,బులియన్ నాయకులు,బస్వపాత్రుని వెంకట నర్సయ్య, రంగు శ్రీనివాస్, శ్రీ రామోజు రాజు,శ్రీ రామోజు శంకరాచారి,సిరికొండ జగదీశ్వర్ చారి,దురు శెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## శివారు కాలనీలకు "దారుల చింత"

### చందాలతో గుంతలు పూడ్చుకుంటున్న కాలనీ వాసులు

నంద్యాల నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 22వ వార్డులో గల శిల్ప నగరం లో శివారు కాలనీల్లో అడుగు వేయాలంటే అవస్థ పడాల్సిన పరిస్థితి నెలకొంది. అంతర్గత రోడ్లు అధ్వానంగా ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అభివృద్ధి పనుల కోసం లక్షలు కేటాయిస్తున్నామని చెబుతున్న శివారు కాలనీ అయిన శిల్ప నగరు పరిస్థితి బాగు పడటం లేదని స్థానికులు వాపోతున్నారు. శిల్పా నగరంలో దాదాపు 2000 వేల మంది జనాభా నివసిస్తున్నారు. ఈ కాలనీలో కొన్ని వీధుల్లో అడుగు తీసి అడుగు వేయాలంటే సహసం చేయాల్సిందే. ఈ కాలనీ 13 ఏళ్ల క్రితం ఏర్పాటు అయిందని తెలిపారు . కర్నూలు – కడప నేషనల్ హైవే ఆనుకుని ఉన్నా సిమెంట్ దారులు వేయలేదన్నారు . అధిక వర్షం కురిస్తే మోకాళ్ల లోతు నీరు పారుతుంటాయి రోడ్ల పై రోజులు తరపడి నీళ్లు నిల్వ ఉంటున్నాయి. శిల్పా నగరంలో నేటికీ మట్టి రోడ్లే దిక్కయ్యాయి. రోడ్డు సరిగ్గా లేక అత్యవసరానికి అంబులెన్స్ రాక రెండు మూడు మరణాలు కూడా సంబవించాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేశారు . ఈ రోడ్ల పరిస్థితి చూడలేక కాలనీ వాసులు కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ వారు ఇంటింటికీ తిరిగి చందాలు వసూలు చేసి గుంతలు పూడ్చు కొంటున్నామని తెలిపారు . కమిటీ సభ్యులు మాట్లాడుతూ మాది చివారు కాలనీ అని అధికారులు గానీ ఎమ్మెల్యే గాని కనీసం వార్డు కౌన్సిలర్ కూడా పట్టించుకోవడం లేదన్నారు. దీనిపై స్పందించి కలెక్టర్ గారు కాలనీలో కనీస మౌలిక వసతులు కల్పించాలని కోరారు .

## నష్ట పోయిన రైతులకు అండగా ఉంటాం

### తీర ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ
### వరద నీటి ప్రవాహం పై ఎప్పటికప్పుడు నివేదికలు సేకరిస్తున్నాం
### జరిగిన నష్టాన్ని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డి దృష్టికి తీసుకుని వెళ్తా బాలనాగిరెడ్డి

మంత్రాలయం తుంగభద్ర వరద నీటి ప్రవాహం తో నష్టపోయిన ప్రతి రైతుకు అండగా ఉంటామని వైఎస్సార్సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షులు / మంత్రాలయం ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి పేర్కొన్నారు. సోమవారం విజయవాడలోని స్వగృహం నుంచి మీడియాతో మాట్లాడుతూ కర్నూలు జిల్లాలోని మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గ ప్రజలకు తెలియజేయడమేమనగా కర్ణాటక రాష్ట్రం లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా తుంగభద్ర డ్యాం నుంచి దిగువకు ప్రతి రోజూ దాదాపు లక్ష యాభై వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. డ్యాం నుంచి వరద నీరు వచ్చి సుంకేశ్వరి రిజర్వాయర్ అక్కడి నుంచి ఎప్పటికప్పుడు నీటిని దిగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు కు విడుదల చేసే విధంగా జిల్లా కలెక్టరు కోటేశ్వరరావు సుంకేసుల రిజర్వాయర్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తీర ప్రాంతాల్లో ఉన్న వాటర్ స్కీం, పంట పొలాలు గురు రాఘవేంద్ర ప్రాజెక్టు ఎత్తిపోతల పథకం నీటి పంపింగ్ మోటారు లు, పంట నీట మునిగి నష్ట పోయిన రైతుల వివరాలను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించడం జరిగింది. జిల్లా కలెక్టర్ గారు కూడా ఎప్పటికప్పుడు రాష్ట్ర స్థాయి అధికారులకు సమాచారం అందజేస్తు నష్టపోయిన ప్రతి రైతుకు రాష్ట్ర ప్రభుత్వం తరుపున నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటాం. అంతే కాకుండా వరద నీటి ప్రవాహం పై ఎప్పటికప్పుడు జిల్లా యంత్రాంగం తో పాటు ఆదోని ఆర్డీఓ రామకృష్ణ రెడ్డి నేతృత్వంలో అన్ని శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా పోలీసు శాఖ వారు నది తీరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జిల్లా ఎస్పీ సిద్దార్థ కౌశిల్ గారి నేతృత్వంలో పగలు, రాత్రి తేడా లేకుండా బందోబస్తు నిర్వహిస్తున్నారు. తీర ప్రాంత ప్రజలు కూడా అప్రమత్తంగా ఉండి అధికారులకు సహకరించాలని కోరుతున్నా. వరద నీటి ప్రవాహం పై ఎప్పటికప్పుడు సమాచారం అందుతుందని తెలిపారు. జిల్లాలో వరద నీటి ప్రవాహం లో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని జరిగిన నష్టాన్నికి సంబంధించిన నివేదికను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్ రెడ్డికి అందజేస్తానని వై. బాలనాగిరెడ్డి సూచించారు.

# ఆంధ్ర రాష్ట్ర ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన వైసిపి, టిడిపి వైఖరులను ఖండించండి



కర్నూలు జూలై 18 -: భారతదేశ రాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపి ప్రతిపాదించిన ఎన్డీఏ అభ్యర్థి ద్రౌపతి ముర్మ కి మద్దతిచ్చి రాష్ట్రానికి ద్రోహం చేసి ఆత్మగౌరవాన్ని తాకట్టు పెట్టిన వైయస్సార్ కాంగ్రెస్ , తెలుగుదేశం పార్టీల వైఖరిని ఖండించాలని , ఈ పార్టీల విధానాల్ని వ్యతిరేకించండనీ ప్రత్యేక హోదాన సాధన సమితి నాయకులు, వామపక్ష నేతలు ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం రోజు రాష్ట్రవ్యాప్తంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం పార్టీలు బిజెపి రాష్ట్రపతి అభ్యర్థికి మద్దతిస్తూ తీసుకున్న వైఖరికి నిరసనగా అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ధర్నా సిఐటియు జిల్లా అధ్యక్షుడు రాధాకృష్ణ అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి వామపక్ష పార్టీలు మద్దతు తెలియజేశాయి. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి గౌస్ దేశాయ్, సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు నర్సింలు,వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కె వి నారాయణ, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఆనంద్ బాబు, మహిళా సంఘం నాయకురాలు శ్యామల తదితరులు మాట్లాడుతూ తాము అధికారంలోకి వస్తే ఆంధ్ర రాష్ట్రానికి పది సంవత్సరాలు ప్రత్యేక హోదా ఇస్తాము, విభజన హామీలు అమలు చేస్తామని చెప్పి గుప్పెడు మట్టి, చెంబులో నీళ్లు తీసుకుని వచ్చి ఆంధ్ర రాష్ట్ర ప్రజల మొఖాన పాడేసిన నరేంద్ర మోడీ ఆయన పార్టీ బిజెపి రాష్ట్రానికి ద్రోహం చేస్తే అలాంటి పార్టీ ప్రతిపాదించిన రాష్ట్రపతి అభ్యర్థి ద్రౌపతి మూర్మ కి బేషరతుగా మద్దతు తెలియజేస్తూ ఓట్లు వేసిన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ, తెలుగుదేశం పార్టీలు రాష్ట్రానికి తీరని ద్రోహం చేశారని వారు ఘాటుగా విమర్శించారు. "తాటి చెట్టు ఎందుకు ఎక్కావయ్యా అంటే దూడమేత కోసం అన్న" చందనంగా ఈ రెండు పార్టీల వైఖరి ఉంది అని వారు ఎద్దేవా చేశారు. ఎస్టి అభ్యర్థి కాబట్టి మేము మద్దతిస్తున్నాం సామాజిక న్యాయాన్ని పాటిస్తున్నాం అని చెప్పే ఈ రాజకీయ పార్టీలు మరి గతంలోనే ఎస్టి అభ్యర్థిగా సంగ్మా పోటీ చేసినప్పుడు ఎందుకు మద్దతు ఇవ్వలేదో ఆంధ్ర రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని వారు నిలదీశారు. ఎస్టీ అభ్యర్థి కాబట్టి వెనకబడిన ప్రాంతం సామాజిక తరగతుల వారికి న్యాయం జరుగుతుందని అనుకుంటే , ద్రౌపతి ముర్మ ప్రజాప్రతినిధిగా మంత్రిగా ఉన్న ప్రాంతంలోనే 12 మంది గిరిజనులను తుపాకులతో కాల్చి చంపితే ఒక్క మాట కూడా మాట్లాడని ఆమె రాష్ట్రపతి అయితే గిరిజనులకు న్యాయం జరుగుతుంది అనడం ప్రజల చెవిలో పువ్వు పెట్టడమే అని వారు విమర్శించారు. 2019 ఎన్నికల్లో జగన్మోహన్ రెడ్డి నాకు ఎక్కువ సీట్లు వచ్చాయి కానీ నా మద్దతుతో బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అవసరం లేకుండానే ఏర్పడిందని ప్రత్యేక హోదా అడుక్కుంటూ ఉండడమే తప్ప వేరే మార్గం లేదని ఆంధ్ర రాష్ట్ర ప్రజలను నమ్మబలికిన ఈయన ఈరోజు తన ఓటు లేకుండా ఉంటే బిజెపి అభ్యర్థి ఓడిపోవడం ఖాయమని తెలిసిన తర్వాత కూడా ప్రత్యేక హోదా విభజన హామీలు అమలు చేస్తేనే మీకు మద్దతిస్తామని ఎందుకు చెప్పలేదో ప్రజలకు సమాధానం చెప్పాలని వారు ఘాటుగా విమర్శించారు. కేవలం తాను కేసుల నుంచి బయటపడడం కోసం తప్ప ఈ ఆంధ్ర రాష్ట్ర అభివృద్ధి గాని, ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా అడగడంలో ఏమాత్రం శ్రద్ధ లేదని చాలా స్పష్టంగా అర్థం అయింది అని వారు తెలిపారు. ఉదయం లేచినప్పటి నుండి జగన్మోహన్ రెడ్డిని తిట్టి పారేసుకున్న చంద్రబాబు నాయుడు ఆయన మద్దతు ఇచ్చిన అభ్యర్థికి తెలుగుదేశం ఏ రకంగా మద్దతు ఇచ్చిందో ప్రజలకు సమాధానం చెప్పాలని వారు నిలదీశారు. చంద్రబాబు నాయుడు కూడా కేసులకు భయపడే నరేంద్ర మోడీ కి లొంగిపోయాడని వారు ఘాటుగా విమర్శించారు. ఈ అధికార ప్రతిపక్ష పార్టీలు కలిసి ఆంధ్ర రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవాన్ని బిజెపి చేతుల్లో తాకట్టు పెట్టారని ఇలాంటి రాజకీయ పార్టీల అసలు రంగు తెలిసిపోయిందని ఇలాంటి వారిని ప్రజలు ఎక్కడ నిలదియాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గురు శేఖర్ సిఐటియు నగర నాయకులు అంజిబాబు విజయ్ షరీఫ్ సాయిబాబా రాముడు రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

## బస్సులు నడపకపోతే ఆందోళన ఉధృతం చేస్తాం -: ఎస్ఎఫ్ఐ

కర్నూలు జూలై 18 -: కర్నూలు నుండి కొత్తకోట, ఎదురూరు, ఆర్కే దుద్యాల, తోల్సాపురం గ్రామాలకు విద్యార్థి బస్సులు నడపకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని డివైఎఫ్ఐ కర్నూలు జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సాయి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఆ గ్రామాలకు బస్సులు నడపాలని సోమవారం దాదాపు 2 గంటలు బస్సులు బైటికి రానివ్వకుండా కర్నూలు ఆర్టీసీ బస్టాండ్ ముందు ఆ గ్రామాల విద్యార్థులను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన చేశామని, శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులను అక్రమంగా అరెస్టు చేయడానికి పోలీసులు ప్రయత్నం చేయగా ఉద్రిక్తత డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి సాయి ఉదయ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,ఆందోళన చేయడానికి కారణం ప్రజా ప్రతినిధులు అధికారులు నిర్లక్ష్యమే కారణమని అన్నారు. బస్సులు రావడం లేదని ఆర్టీసీ అధికారుల దగ్గరికి వెళ్తే ఫస్ట్ రోడ్డు వేయమని అడగండి తర్వాత బస్సులు వేస్తామని అవహేళన చేశారనిచూస్తాంలే అని మాట్లాడడానికి కూడా టైం ఇవ్వకుండా వెళ్లిపోయారని , ఆర్డీవో గారికి వినతిపత్రం అందజేస్తే బస్సులు తర్వాత మీరు ముందు చదువుకోండి అని చెబుతున్నారని, అధికారులు నిర్లక్ష్య కారణంగా చేశామని ఇప్పటికైనా అధికారుల నిర్లక్ష్యం విడకపోతే దశల వారి పోరాటాలు చేస్తామని పోలీసులు అరెస్టులకు వెనకాడబోమని హెచ్చరించారు

# రైతుల డబ్బులు దుర్వినియోగంపై జిల్లా కలెక్టర్ విచారణ చేపట్టాలి

## మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకట రాముడు



ఆలూరు వ్యం ఆధ్వర్యంలో ఏర్పాటు అయిన పెరవలి రంగనాథ స్వామి రైతు ఉత్పత్తి దారుల కేంద్రంలో రైతులకు సంబంధించిన దాదాపు రూ 18 లక్షల నిధులు దుర్వినియోగం అయ్యాయని వీటిపై వెంటనే విచారణ చేపట్టాలని సోమవారం జిల్లా కలెక్టర్ కు మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకట్ రాముడు ఫిర్యాదు చేశారు .ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కు రూ 18 లక్షల ను ఎలా దుర్వినియోగం చేశారనే విషయాలను మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకట రాముడు వివరించారు . గత తెలుగుదేశం ప్రభుత్వంలో గిరిగెట్ల, అమీనాబాద్ ,రాంపల్లి, చెన్నంపల్లి, రామలింగయ్య పల్లి ,కొత్తపల్లి గుడిసెలు గ్రామాలలో రైతుల పొలాల్లో అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి ప్రభుత్వ ఆర్థిక సహాయంతో పెరవలి రంగనాథ స్వామి రైతు ఉత్పత్తి దారుల కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. దీంతో 1500 మంది రైతులు ఒక్కొక్కరు 1100 రూపాయలు సభ్యత్వం చెల్లించి ఆ సంఘంలో సభ్యులుగా చేరారని, సభ్యులుగా చేరిన రైతులందరికీ ప్రభుత్వము నుండి వివిధ రాయితీలు అందించడంతో పాటు వారి పొలాల్లో అభివృద్ధి పనులు కూడా చేయడం జరిగింది అని వివరించినట్లు ఆయన తెలిపారు .అయితే వైయస్సార్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత గతంలో ఉన్న కమిటీ తొలగించి కొత్త కమిటీని ఏర్పాటు చేశారన్నారు. కొత్త కమిటీ కి చైర్మన్ గా రామలింగ పల్లి గ్రామానికి చెందిన రంగనాథ రెడ్డి ని ఎంపిక చేశారని కలెక్టర్ కు ఆయన వివరించారు. గతంలో రైతుల నుండి సభ్యత్వం కింద వసూలు చేసిన దాదాపు రూ 18 లక్షల ను చైర్మన్ గా ఉన్న రంగనాథ్ రెడ్డి డ్రా చేసుకోవడం జరిగిందని బత్తిని వెంకట రాముడు కలెక్టర్ కు వివరించినట్లు బత్తిని వెంకట రాముడు విలేకరులకు తెలిపారు . అయితే ఈ విషయంపై అకౌంటెడ్ విష్ణువర్ధన్రెడ్డి ఫోర్జరీ సంతకాలతో డ్రా చేసినట్లు జొన్నగిరి పోలీస్ స్టేషన్ లో కేసు పెట్టి తూతూమంత్రంగా విచారణ చేసి అకౌంటీన్ట్ విష్ణువర్ధన్రెడ్డి ని జైలుకు పంపడం జరిగిందన్నారు. డ్రా చేసిన తర్వాత ఆరు నెలలకు కేసు పెట్టడం లో పలు అనుమానాలు ఉన్నాయన్నారు. రూ 100 లు బ్యాంకులో డ్రా చేస్తే సెల్ ఫోన్ కు మెసేజ్ రావడం జరుగుతుందన్నారు .18 లక్షల వరకు డబ్బులు డ్రా చేస్తే చైర్మన్ సెల్ కు మెసేజ్ ఎందుకు రాలేదని ఆయన కలెక్టర్ కు వివరించినట్లు తెలిపారు. అందువల్ల ఈ విషయంపై చైర్మన్ రంగనాథ్ రెడ్డి పై చర్యలు తీసుకొని, రైతుల సభ్యత్వ డబ్బులను రైతులకు చెల్లించే విధంగా చూడాలని కలెక్టర్కు ఫిర్యాదు చేసినట్లు మాజీ జడ్పీ చైర్మన్ బత్తిని వెంకట్ రాముడు విలేకరులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొమ్మ వెంకటేశ్వర్లు, సర్పంచ్ సలహాదారుడు, టిడిపి ఎస్ టి సెల్ రాష్ట్ర కార్యదర్శి వెంకటపతి, టిడిపి నాయకులు మా భాష తదితరులు పాల్గొన్నారు.

# టిసి లక్ష్మమ్మ ఆశయాలను కొనసాగిస్తాం-:ఐద్వా

కర్నూలు జూలై 18 -: కర్నూలు జిల్లా మహిళా ఉద్యమ నిర్మాత టిసీ లక్ష్మమ్మ ఆశయాలను కొనసాగిస్తామని మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు జి ధనలక్ష్మి సిపిఎం నాయకులు సిహెచ్ సాయి బాబా కె సుధాకరప్ప తెలిపారు టిసీ లక్ష్మమ్మ ఏడవ వర్ధంతి సందర్భంగా ముజఫర్ నగర్ కుట్టు సెంటర్లో లక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వర్ధంతిని నిర్వహించారు. జె లక్ష్మీ బాయి అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో వారు మాట్లాడుతూ కర్నూలు జిల్లాలో మహిళల సమస్యలపై నిరంతరం పోరాటం చేస్తూ మహిళలను ఐక్యం చేసిన ఘనత టిసి లక్ష్మమ్మ దని తెలిపారు. ప్రతి వారిని గౌరవించడం అభిమానించడం ఆమెలో వున్న మంచి లక్షణం అని తెలిపారు టిసి లక్ష్మమ్మ వార్డు మెంబర్ గా ఉన్న సందర్భంగా తన వార్డు సమస్యలే కాకుండా ఇతర వార్డుల సమస్యలతో పాటు కర్నూలు నగరంలో ఉన్న అనేక సమస్యలను అధికారుల దృష్టికి తీసుకుని వచ్చి పరిష్కారం చేసేదని తెలిపారు ఎవరైనా మహిళలు ఆపదలో ఉంటే వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కరించే వారని తెలిపారు టిసి లక్ష్మమ్మ ని ఆదర్శంగా తీసుకొని ప్రతి మహిళ మహిళల కోసం నిరంతరం కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం



## -: కర్నూలు జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఐపియస్
## స్పందన కార్యక్రమం ద్వారా స్వీకరించిన ఫిర్యాదుల పై త్వరితగతిన స్పందించి , పరిష్కరించాలి
## పోలీసు అధికారులను ఆదేశించిన జిల్లా ఎస్పీ

కర్నూలు జూలై 18 -: కర్నూలు నగరంలోని కొత్తపేట దగ్గర ఉన్న స్పందన కార్యాలయంలో జిల్లా ఎస్పీ సిద్దార్థ్ కౌశల్ ఐపియస్ సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు.కర్నూలు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి స్పందన కార్యక్రమంకు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్పీ మాట్లాడి వారి యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వచ్చిన ఫిర్యాదుల్లో కొన్ని ...1) ఎలక్ట్రిసిటీ డిపార్ట్మెంట్లో మా కుమారునికి అటెండర్ ఉద్యోగం, మా కోడలుకు కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలను కాంట్రాక్ట్ బేసిస్ కింద ఇప్పిస్తానని చెప్పి ఒక వ్యక్తి డబ్బులు తీసుకొని మోసం చేశాడని కర్నూలు బుధవార పేట కు చెందిన రాంబాబు ఫిర్యాదు చేశారు .2) తిరుమల తిరుపతి దేవస్థానంలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి ఒక వ్యక్తి డబ్బులు తీసుకొని మోసం చేశాడని కర్నూలు మాధవీ నగర్ కు చెందిన గోవిందరాజులు, రత్నాకర్ రెడ్డి ఫిర్యాదు చేశారు.

# నాగ్ ది ఘోస్ట్.. యాక్షన్ డోస్ ఎక్కువైతే కష్టమే?




విభిన్నమైన కథాంశాలను తెరపైకి తీసుకువచ్చే అతికొద్ది మంది టాలెంటెడ్ దర్శకుల్లో ప్రవీణ్ సత్తారు ఒకరు. చందమామ కథలు సినిమాతో జాతీయస్థాయిలో అవార్డు రావడంతో అతనికి మంచి గుర్తింపు లభించింది. దీంతో కొంతమంది ప్రముఖ హీరోలు అతనితో సినిమాలు చేయడానికి కూడా చాలా ప్రయత్నాలు చేశారు. అయితే మరి కొందరు మాత్రమే కంటెంట్ నచ్చకపోవడంతో చర్చల దశలోనే కొన్ని ప్రాజెక్టుల నుంచి తప్పుకోవడం జరిగింది.ఆమధ్య ఈ దర్శకుడు తన స్టైల్ కు భిన్నంగా గుంటూరు టాకీస్ అనే సినిమా చేశాడు. ఆ తర్వాత గరుడవేగ సినిమాతో మాత్రం పరవాలేదు అనే విధంగా మంచి క్రేజ్ అయితే అందుకున్నాడు. ఇక ఇప్పుడు అతని ఫోకస్ మొత్తం ది గోస్ట్ సినిమా పైనే ఉంది. ఈ సినిమాతో ఎలాగైనా మంచి విజయాన్ని అందుకొని అగ్ర దర్శకుల్లో ఒకరిగా కొనసాగాలని ఫిక్స్ అయ్యాడు.అయితే ఈ సినిమాలో యాక్షన్ సీక్వెన్స్ పై ఇటీవల అతను క్లారిటీ ఇచ్చిన విధానం సోషల్ మీడియాలో కాస్త హాట్ టాపిక్ గా మారిపోయింది. ఎందుకంటే ఈ సినిమాలో మొత్తంగా 12 యాక్షన్ సీక్వెల్స్ ఉన్నాయంట.ఇక అందులో ఎనిమిది యాక్షన్స్ సీన్స్ అయితే భారీ స్థాయిలోనే డిజైన్ చేసినట్లుగా చెప్పుకొచ్చాడు. రీసెంట్ గా ది గోస్ట్ సినిమాకు సంబంధించిన ఫస్ట్ లుక్ టీజర్ అయితే పెద్దగా ఆకట్టుకోలేకపోయింది. అందులో కత్తితో నాగర్జున అలా శత్రువులను నరుక్కుంటు వెళ్లడం రొటీన్ గానే అనిపించింది.ఒక గూఢచారి పాత్రలో చీకట్లోనే ఉగ్రవాదాన్ని నేలమట్టం చేసే పాత్రలో నాగార్జున కనిపించబోతున్నట్లు క్లారిటీ వచ్చేసింది. అయితే కథలో కంటెంట్ లేకుండా ఒకేసారి 12 రకాల యాక్షన్ సీక్వెన్స్ అంటే ఆడియన్స్ అంతగా కనెక్ట్ కాకపోవచ్చు అని అక్కినేని అభిమానులు సైతం సోషల్ మీడియాలో స్పందిస్తున్నారు.కానీ దర్శకుడు ప్రవీణ్ మాత్రం సినిమాపై ఫుల్ కాన్ఫిడెంట్ గానే ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ సినిమా సీక్వెల్ పై ఇంకా ఎలాంటి క్లారిటీకి రాలేదు అని సినిమా రిజల్ట్ ని బట్టి ఆ తర్వాత ఆలోచిస్తాను అని ప్రవీణ్ ఒక వివరణ అయితే ఇచ్చాడు.

# మజిలీ భామ.. ఈ ఒక్కటి క్లిక్కయితే..



నాగచైతన్య సమంత నటించిన మజిలీ సినిమాలో సెకండ్ హీరోయిన్ గా ముఖ్యమైన పాత్రలో కనిపించిన దివ్యాంశ కౌశిక్ నటిగా ఐతే మంచి క్రేజ్ అందుకుంది. ఆ సినిమా బాక్సాఫీస్ వద్ద కూడా భారీ స్థాయిలో విజయాన్ని అందుకోవడంతో ఈ బ్యూటీకి అవకాశాలు అయితే చాలానే వచ్చాయి.కానీ తొందరపడకుండా కేవలం తనకు నచ్చిన మంచి కంటెంట్ ఉన్న పాత్రలను సెలెక్ట్ చేసుకోవాలని అనుకుంది. ఈ క్రమంలో ఆమె కొన్ని కమర్షియల్ సినిమాలను కూడా వదులుకున్నట్లు ఇండస్ట్రీలో ఒక టాక్ అయితే వినిపించింది.ఏదేమైనా కూడా దివ్యాంశ కౌశిక్ కాస్త ఆలస్యంగా అయినా సరే మంచి సినిమాలతో ప్రేక్షకులను ఆకట్టుకోవాలని అనుకుంటుంది. ప్రస్తుతం ఈ బ్యూటీకి తమిళంలో అయితే చాలా మంచి అవకాశాలు వస్తున్నాయి.ఆమధ్య సిద్ధార్థ్ తో నటించిన సినిమా కూడా నటిగా మంచి గుర్తింపును అందించింది. ఇక ప్రస్తుత ఈ బ్యూటీ తెలుగులో రవితేజ నటించిన రామారావు ఆన్ బ్యూటీ సినిమా ద్వారా మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతోంది.ఈ సినిమా ఎంతవరకు సక్సెస్ అవుతుంది అనే విషయంలో ఇప్పటివరకు ఎలాంటి క్లారిటీ అయితే లేదు. కానీ తప్పకుండా మంచి విజయం సాధిస్తుంది అని చిత్రంగా యూనిట్ కాన్ఫిడెంట్ గా ఉంది. రెగ్యులర్ ప్రమోషన్స్ లో పాల్గొంటున్న దివ్యాంశ సినిమా రిజల్ట్ పై ఎంతో నమ్మకంగా ఉన్నట్లు తెలియజేసింది. ప్రస్తుతం ఈ బ్యూటీ కి సంబంధించిన కొన్ని ఫోటోలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.రామారావు ఆన్ డ్యూటీ సినిమా సక్సెస్ అయితే మాత్రం ఆమె కెరీర్ మరొక రేంజ్ కు వెళ్లడం ఖాయమని కూడా ఒక టాక్ అయితే వినిపిస్తోంది. ప్రస్తుతం ఈ డ్యూటీ చేతిలో రెండు తమిళ సినిమాలతో పాటు అలాగే మలయాళం కన్నడ సినిమాలు కూడా ఉన్నాయట. ఇక తెలుగులో త్వరలోనే ఒక మీడియం రేంజ్ హీరోతో తో సినిమా చేయడానికి సిద్ధమవుతున్నట్లుగా తెలుస్తోంది. మరి దివ్యాంశ కౌశిక్ రాబోయే సినిమాలతో మజిలీ రేంజ్ లో సక్సెస్ అందుకొని స్టార్ హీరోయిన్ గా బిజీ అవుతుందో లేదో చూడాలి.

# చిరంజీవి-రాజమౌళిని బాలీవుడ్ కి రప్పించేలా ఉన్నారే!

కొన్ని నెలలుగా బాలీవుడ్ సెలబ్రిటీలు టాలీవుడ్...కోలీవుడ్ తో క్లోజ్ గా మూవ్ అవుతోన్న సంగతి తెలిసిందే. బాలీవుడ్ స్టార్లు అంతా టాలీవుడ్ స్టార్లతో సన్నిహితంగా మెలుగుతున్నారు. అప్పట్లో మిస్టర్ పర్ ఫెక్ట్ నిస్ట్ అమిర్ ఖాన్ నాగచైతన్య ఆహ్వానించ కపోయినా ఆ యంగ్ హీరో సినిమా ఫంక్షన్ కి విచ్చేసి సర్ ప్రైజ్ చేసారు. అంతటి దిగ్గజ నటుడు ఏకంగా హైదరాబాద్ రావడం ఏంటి? అని అప్పట్లో చర్చనీయాంశంగా మారింది.ఎప్పుడు హైదరాబాద్ వైపు



చూడని అమిర్ అంతకు ముందు నుంచే టాలీవుడ్ కి టచ్ లో ఉన్నారు. ఇక కండల గండరుడు సల్మాన్ ఖాన్ కూడా మెగాస్టార్ చిరంజీవి..చరణ్ లకు రెగ్యులర్ గా టచ్ లో ఉంటున్నారు. తన సినిమా షూటింగ్ హైదరాబాద్ లో జరిగినంత కాలం దాదాపు మెగా హీరోలు అందర్నీ చుట్టేసారు. ఇక బాద్ షా షారుక్ ఖాన్ ఏకంగా కోలీవుడ్ మేకర్ తోనే సినిమా చేస్తున్నాడు.తన సినిమాలో సౌత్ నటుల్ని సైతం భాగం చేసి ముందుకు వెళ్తున్నాడు. ఈ రెండు సన్నివేశాల్ని బట్టి టాలీవుడ్..కోలీవుడ్ రేంజ్ ఏ స్థాయికి చేరిందన్నది అద్దం పడుతుంది. ఇక ఇటీవలి కాలంలో రాక్ స్టార్ రణబీర్ కపూర్ 'బ్రహ్మాస్త్ర' సినిమా ప్రమోషన్ కోసం ఏకంగా మెగాస్టార్ చిరంజీవి సహాయమే తీసుకున్నారు. తెలుగు వెర్షన్ కి మెగాస్టార్ వాయిస్ ఓవర్ ఇవ్వడంతో బ్రహ్మాస్త్ర ఒక్కసారిగా పైకి లేచింది.ఆ సినిమా సౌత్ రైట్స్ దిగ్గదర్శకుడు రాజమౌళికి అప్పగించి ఎన్ క్యాష్ చేసుకునే ప్లాన్ చేసాడు. ఆ తర్వాత అమిర్ ఖాన్ చిరంజీవి..సుకుమార్ లాంటి వాళ్లకు 'లాల్ సింగ్ చద్దా' స్పెషల్ షో వేసి మరీ చూపించారు. ఇలాంటి సన్నివేశాలు ఇన్నేళ్ల టాలీవుడ్ చరిత్రలో ఏనాడు చోటు చేసుకోలేదు. 2022 లోనే ఈ అద్భుతాలు అన్ని జరుగుతున్నాయి.ఇవన్నీ చూస్తుంటే? 'బ్రహ్మాస్త్ర'..'లాల్ సింగ్ చద్దా' హిందీ ప్రమోషన్లకి సైతం టాలీవుడ్ సెలబ్రిటీల చేత ముంబైలో కూడా చేయిస్తారా? అన్న డౌట్ రెయిజ్ అవుతుంది. చిరంజీవి..రాజమౌళిలను ముంబై ఆహ్వానించి అక్కడా తమ సినిమాలకు ప్రచారం చేయించుకునేలాగే సన్నివేశం కనిపిస్తుంది. ఎందుకంటే 'బాహుబలి'...'ఆర్ ఆర్ ఆర్' లాంటి సినిమాల్ని హిందీ బెల్ట్ లో స్థానిక హీరోలు ఎంతగానో ప్రోత్సహించారు.అక్కడ నిర్వహించిన కొన్ని షోలకు సదరు హీరోలు హాజరయ్యారు. ఆ కృతజ్ఞతా భావంతోనైనా బాలీవుడ్ ఆహ్వానిస్తే టాలీవుడ్ సెలబ్రిటీలు వెళ్లకుండా ఉంటారా ? అనిపిస్తుంది. భాషల మధ్య వ్యత్యాసం కూడా ఇప్పుడిప్పుడే తొలగిపోతుంది. మనవాళ్లు పాన్ ఇండియా అంటూ హిందీ మార్కెట్ ని పెద్ద ఎత్తున టార్గెట్ చేస్తున్నారు. ఈ తరుణంలో వాళ్ల సహకారం అంతే అవసరం. కాబట్టి కలయిక ముఖ్యమే కదా.

# 4 వికెట్లు, 71 పరుగులు.. మామూలు విషయం కాదు! వాళ్ల ఇగోతో ఆడుకుంటున్నాడు!



రీఎంట్రీలో అదిరిపోయే ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడు టీమిండియా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా. టీ20 ప్రపంచకప్-2021 తర్వాత జట్టుకు దూరమైన అతడు.. గోడకు కొట్టిన బంతిలా దుసుకువచ్చాడు. తొలుత ఐపీఎల్-2022లో గుజరాత్ టైటాన్స్‌ను ఎంట్రీలోనే గెలిపించి కెప్టెన్‌గా సత్తా చాటిన పాండ్యా.. జాతీయ జట్టులోనూ తన స్థానాన్ని సుస్థిరం చేసుకునే ప్రదర్శనతో ఆకట్టుకుంటున్నాడు.బౌలింగ్‌లో లోపాలు సరిదిద్దుకున్న పాండ్యా.. ఆల్‌రౌండర్‌గా అదరగొడుతున్నాడు. ఇక తాజాగా ఇంగ్లండ్‌తో మూడో వన్డేలో 7 ఓవర్ల పాటు బౌలింగ్ చేసిన అతడు.. కేవలం 24 పరుగులు ఇచ్చి 4 వికెట్లు పడగొట్టాడు. అదే విధంగా... ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు దిగి 55 బంతుల్లో 10 ఫోర్ల సాయంతో 71 పరుగులు సాధించాడు.తద్వారా 5 వికెట్ల తేడాతో టీమిండియా ఇంగ్లండ్ మీద గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. ఇక సిరీస్ ఆసాంతం మెరుగ్గా రాణించిన పాండ్యాను ప్లేయర్ ఆఫ్ ది సిరీస్ అవార్డు వరించింది. అదే విధంగా.. 113 బంతుల్లో 16 ఫోర్లు, 2 సిక్సర్ల సాయంతో 125 పరుగులు చేసి అజేయంగా నిలిచిన రిషభ్ పంత్ ప్లేయర్ ఆఫ్ మ్యాచ్‌గా నిలిచాడు.ఈ నేపథ్యంలో టీమిండియా మాజీ బ్యాటర్, కామెంటేటర్ ఆకాశ్ చోప్రా.. హార్దిక్ పాండ్యాపై ప్రశంసల జల్లు కురిపించాడు. "ఆఖరి వరకు అజేయంగా నిలిచాడు కాబట్టి రిషభ్ పంత్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అయ్యాడు. వాస్తవానికి పంత్ ఆటను నేను ఎంతగానో ప్రేమిస్తాను.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**